ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 28.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 278 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

గంభీర్‌ను తప్పిస్తారా..? 8

ఎక్సైజ్ శాఖలో అక్రమ వసూళ్లు?

టార్గెట్ 100 కోట్లు!

- డిసెంబర్ చివరి అమ్మకాలే లక్ష్యం
- ఒక్కో వైన్ షాప్ నుంచి రూ.2.5 లక్షల డిమాండ్?
- ఒక్కో ఉమ్మడి జిల్లాకు రూ.7 కోట్ల టార్గెట్
- నెలకు అదనంగా మరో రూ.15 వేలు
- కొత్త వ్యాపారుల్లో ఆందోళన
- మా దృష్టికి రాలేదు.. ఫిర్యాదులు వస్తే చర్యలు

ప్రతిపక్షం, ఉత్తర తెలంగాణ బ్యూరో

డిసెంబర్ 27: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు బరితెగించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ, సర్పంచ్ ఎన్నికలు, డిసెంబర్ 31 అమ్మకాలను అవకాశంగా మలుచుకొని రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, రెండేళ్ల కాలానికి గాను ఒక్కో వైన్ షాప్ నుంచి రూ.2.5 లక్షలు ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా బ్రాండీ, వైన్ షాపుల నుంచి రూ.70 నుంచి రూ.100 కోట్ల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కో ఉమ్మడి జిల్లాకు రూ.7 కోట్ల టార్గెట్?

ప్రచారంలో ఉన్న సమాచారం మేరకు, ప్రతి ఉమ్మడి జిల్లాకు రూ.7 కోట్ల వసూలు లక్ష్యంగా పెట్టుకొని, అధికారుల మధ్య పంపకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే 287 మద్యం దుకాణాలు ఉండగా, ఇక్కడ మాత్రమే సుమారు రూ.7 కోట్ల వరకు వసూలు చేస్తున్నట్లు వ్యాపారులు గుసగుసలాడుకుంటున్నారు. ఇవే కాకుండా, ప్రతి నెలా ఒక్కో వైన్ షాప్ నుంచి రూ.15 వేల చొప్పున అదనపు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో రూ.50 వేలకే పరిమితమైన వసూళ్లు ఇప్పుడు లక్షల్లోకి చేరాయని పాత మద్యం వ్యాపారులు వాపోతున్నారు.

కొత్త వ్యాపారుల్లో ఆందోళన

షాప్ అద్దెలు, ఫస్ట్ క్వార్టర్ ఫీజులు, ఫర్నిచర్ ఖర్చులతో ఇప్పటికే ఆర్థిక భారం మోస్తున్న కొత్త మద్యం వ్యాపారులు, ఈ అక్రమ వసూళ్లతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. "ఇవ్వకపోతే కేసులు పెడతారు" అన్న

...:: మిగతా 2లో

ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు

ఎంజీ నరేగా రద్దుతో ఉపాధి కరువు

మహాత్ముడికి ఇది అవమానం

"మోదీ ప్రభుత్వం ఎంజీనరేగాను రద్దు చేసింది. దీంతో లక్షలాది మంది పేదలకు మోదీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. ఎంజీనరేగాను రద్దు చేయడం జాతిపిత మహాత్మా గాంధీకి అవమానం. యూపీఏ ప్రభుత్వం పని చేసే హక్కు, ఆహార హక్కు, విద్యా హక్కు, ఆరోగ్య హక్కు వంటి ముఖ్యమైన చర్యలు తీసుకుంది. మోదీ ప్రభుత్వం పని చేసే హక్కుపై ముందస్తుగా క్రూరమైన దాడిని ప్రారంభించింది. అందుకు నేను చాలా బాధపడ్డాను. మోదీ ప్రభుత్వం పేదల పట్ల శ్రద్ధ చూపడం లేదు. కొంతమంది పెద్ద పెట్టుబడిదారుల లాభాల పట్ల మాత్రమే శ్రద్ధ చూపుతోంది" అని ఖర్గే వ్యాఖ్యానించారు.

- 'రైట్ టు వర్క్'పై మోదీ సర్కార్ క్రూర దాడి
- ఎంజీనరేగా రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం
- 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తాం
- 2026 ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధం
- ఎస్ఐఆర్‌పేరుతో ఓటర్ల హక్కులపై కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐల దుర్వినియోగం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరువవుతుందని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలోఖర్గే పలు కీలక అంశాలపై మాట్లాడారు .ఈ సందర్భంగా ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎంజీనరేగా రద్దును మహాత్మాగాంధీకి అవమానంగా, 'రైట్ టు వర్క్'పై మోదీ సర్కార్ క్రూర దాడిగా ఖర్గే అభివర్ణించారు. పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వానికి పేదల కంటే

...:: మిగతా 2లో

ఇది పేదల హక్కుపై జరిగిన దాడి

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, కొత్త చట్టాన్ని తీసుకురావడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తాంధీ తీవ్రంగా విమర్శించారు. ఇది పేద ప్రజల హక్కుపై జరిగిన దాడిగా అభివర్ణించారు.

7

200 ఇండ్లను కూల్చిన అధికారులు

కర్ణాటకలో 200కుపైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. దీంతో సుమారు 400 ముస్లిం కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల బుల్డోజర్ చర్యను ఇక్కడ అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

7

పాలమూరు–రంగారెడ్డిపై నిర్లక్ష్యం

- నీటి హక్కులు కోల్పోయిన తెలంగాణ
- నీళ్లు, నిధులు, న్యాయం మూడూ గల్లంతే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్/ నాగర్ కర్నూల్, డిసెంబర్ 27: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం వల్ల తెలంగాణకు రావాల్సిన 90 టీఎంసీల నీటి హక్కు కోల్పోయామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అవినీతి, నిర్వాకం, ప్రజాధనం వృథాపై రాష్ట్ర ప్రభుత్వంపై మండి పడ్డారు. నాగర్ కర్నూల్ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ ఆస్పత్రులు, అభివృద్ధి పనులను పరిశీలించిన ఆమె రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వట్టెం రిజర్వాయర్, వట్టెం పంప్ హౌస్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ లోని ఎల్లూరు పంప్ హౌస్, నార్లపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన కవిత, కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ సాగునీటి ఫలితాలు కనిపించడంలేదని అన్నారు. వరదల సమయంలో వట్టెం పంప్ హౌస్ మునిగిపోయిన నేపథ్యంలో భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు రాకుండా తీసుకున్న చర్యలపై అధికారులను ప్రశ్నించారు. పంపుల డ్రై రన్, రిపేర్లు, కాల్వల పూర్తి స్థాయి పనులపై వివరాలు

...:: మిగతా 2లో

బీజేపీ పగ్గాలు నితిన్ నబిన్‌కే

- మోదీ, అమిత్‌షా మద్దతు
- జనవరి 20న అధికారిక ప్రకటన!
- యువతరానికి పెద్దపీట

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. పార్టీ నూతన సారథిగా యువనేత నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. జనవరి 20వ తేదీ నాటికి ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, అధికారిక ప్రకటన వెలువరించడానికి అధిష్ఠానం సిద్ధమైందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువతరానికి పెద్దపీట వేయాలన్న వ్యూహంలో భాగంగా 45 ఏళ్ల నితిన్ నబిన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

జనవరి 15 తర్వాత ఢిల్లీలో సందడి

'బీజేపీ జాతీయ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ జనవరి 15 తర్వాత వేగం పుంజుకోనుంది. జనవరి 15 తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు దిల్లీ రావాలని పిలుపు వెళ్లనుంది. జనవరి 18 నుంచి 20 మధ్య మూడు రోజుల పాటు ఎన్నికల తంతు జరగనుంది. జనవరి 20వ తేదీన కొత్త అధ్యక్షుడిగా నితిన్ నబిన్ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది' అని పార్టీ వర్గాలు తెలిపాయి.

మోదీ, షా సంపూర్ణ మద్దతు

నితిన్ నబిన్ అభ్యర్థిత్వానికి పార్టీ అగ్రనేతల పూర్తి మద్దతు లభించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన నామినేషన్ పత్రాలపై స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతకం చేయనున్నారని, కేంద్ర హోంమంత్రి

...:: మిగతా 2లో

దుమారం రేపిన దిగ్విజయ్ సింగ్ పోస్ట్, కామెంట్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేసిన ఫోటో తీవ్ర దుమారాన్ని రేపుతున్నది. ఆయన ఆ ఫోటోపై చేసిన కామెంట్ కూడా పెను చర్చకు దారి తీస్తున్నది.

7

ఈ యేడాది నేరాలు తగ్గాయి

- 15 శాతం క్రైమ్ రేట్ తగ్గింది
- మహిళలు, చిన్నారులపై మాత్రం పెరిగాయి
- హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సజ్జనార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్27: హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ యేడాది నేరాలు తగ్గినట్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ సజ్జనార్ లిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 15 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వెల్లడించారు. కానీ, మహిళలు, చిన్నారులపై మాత్రం నేరాలు పెరిగినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించిన సీపీ సజ్జనార్, 2025 యాన్యువల్ క్రైమ్ రిపోర్టును విడుదల చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేట్ 15 శాతం తగ్గగా, హైదరాబాద్ కమిషనరేట్ లో కేసుల సంఖ్య 2024తో పోలిస్తే 14 శాతం తగ్గిందని చెప్పుకొచ్చారు. మహిళలపై నేరాల సంఖ్య పెరిగిందని, 2024 సంవత్సరంతో పోలిస్తే 6 శాతం మేర పెరిగిందని తెలిపారు. చిన్న పిల్లలపై నేరాల(ఫోక్సో కేసులు) విషయంలోనూ గతేడాదితో పోలిస్తే 27 శాతం పెరిగినట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. సైబర్ క్రైమ్ నేరాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయని.. మొత్తం 2,286 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఇన్వెస్ట్‌మెంట్ మోసాలకు సంబంధించి 740 కేసులు, మ్యాట్రిమోని మోసాలు 12, వాట్సాప్ డీపీ మోసాలు 8, జాబ్ పేరుతో మోసాలు 43, ఓటీపీ మోసాలు 458 కేసులు నమోదైనట్లు సజ్జనార్

...:: మిగతా 2లో



ప్రజావసరాలు పెద్ద ఎత్తున తీరుస్తాం

- ప్రతి పైసా ప్రజలకు పంచుతాం
- వారం వారం ఇందిరమ్మ ఇల్లుల బిల్లులు చెల్లిస్తున్నాం
- గత పాలకులు అందరినీ తాకట్టు పెట్టారు
- ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ అల్లకల్లోలం చేసింది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం, పాలేరు

డిసెంబర్27: రాబోయే రోజుల్లో ప్రజల అవసరాలు పెద్ద ఎత్తున తీరుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన పాలేరు నియోజకవర్గం లోని అనంత నగర్ లో 33/ 11 కెవి సబ్ స్టేషన్ ను ప్రారంభించి, మరో సబ్ స్టేషన్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రభుత్వం మన అందరిదీ వనరులు, సంపద పోగు చేసి ప్రతి పైసా ప్రజలందరికీ పంచుతాం తప్ప దోపిడీదారులు, పాలకుల కోసం కాదు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం అందుతుంది ఉచితంగా 200 యూనిట్ల కరెంటు, తినడానికి సన్న బియ్యం, ఉండడానికి ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు, ఎక్కడికన్నా

...:: మిగతా 2లో

కరుణ, త్యాగాలకు ప్రతిరూపం గురుగోవింద్

మానవుల మనుగడను కాపాడేందుకు.. సత్యం, న్యాయం, ధర్మం వైపు నిలబడేందుకు గురుగోబింద్ జీవితం, బోధనలు ప్రేరణ కలిస్తాయని ప్రధాని తెలిపారు.

7

రాజకీయం

టార్గెట్ 100 కోట్లు!

మొదటిపేజీ తరువాయి

భయంతో కొందరు మౌనంగా డబ్బులు ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. మరికొందరు మాత్రం పై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మా దృష్టికి రాలేదు... అధికారులు

ఈ ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మద్యం దుకాణాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, అలాంటి ఘటనలు మా దృష్టికి రాలేదు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే, ఇవన్నీ కేవలం ఉత్త మాటలే అని, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని మద్యం వ్యాపారులు అంటున్నారు. ఇది కేవలం కరీంనగర్ జిల్లా సమస్య కాదని, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తంతే అని వారు పేర్కొంటున్నారు.

నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు మంత్రి సీతక్క

- కరోనా సమయంలో నిబంధనల ఉల్లంఘన కేసు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 5కు వాయిదా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్27: కరోనా కాలంలో నమోదైన కేసుకు సంబంధించి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, ఇతర నేతలు శనివారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసు విచారణలో భాగంగా కోర్టు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు కోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ 2020లో కరోనా సమయంలో నిబంధనలను ఉల్లంఘించామనే ఆరోపణలతో గత ప్రభుత్వం తమపై తప్పుడు కేసులు బనాయించిందని తెలిపారు. కరోనా చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని, సామాన్య ప్రజలపై చికిత్స భారం తగ్గించాలని డిమాండ్ చేసినందుకే అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నామంటూ తమపై అభియోగాలు మోపడం అన్యాయమని పేర్కొన్నారు. కరోనా నిబంధనలను పూర్తిగా పాటిస్తూ ప్రజల పక్షాన శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశామని, ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని కోర్టుకు తమ న్యాయవాదులు స్పష్టంగా వివరించారని మంత్రి తెలిపారు. తమ వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసిందని, న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉందని మంత్రి సీతక్క తెలిపారు.

మాటల్లో తప్పులు దొర్లాయి

- కావల్సిన వారే కుట్ర చేస్తారనుకోలేదు : నటుడుశివాజీ
- మహిళా కమిషన్ ముందు వివరణకు హాజరు
- ఇకపై జాగ్రత్తగామాట్లాడాలని కమిషన్‌సూచన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్27: నటుడు శివాజీ హైదరాబాద్లోని మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. మహిళలపై వ్యాఖ్యల వ్యవహారంలో శివాజీకి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు శివాజీ వ్యక్తిగతంగా హాజరయ్యారు. విచారణకు హాజరైన శివాజీ మహిళలపై వ్యాఖ్యల అంశంలో వివరణ ఇచ్చారు. దాదాపు 3 గంటల పాటు విచారించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, విచారణ అనంతరం వివరణ పత్రం అయన నుంచి తీసుకుని పంపించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేశారు. కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అడిగిన వాటికి సమాధానం చెప్పానని నటుడు శివాజి వెల్లడించారు. ఇకపై మహిళల పట్ల చులకనగా మాట్లాడబోనని శివాజీ తెలిపారు.

నాపై కుట్ర జరుగుతోంది

విచారణ అనంతరం మీడియాతో శివాజీ మాట్లాడుతూ తన పైన కుట్ర జరుగుతుందని ఆరోపించారు. తనతో పాటు సినిమా కెరియర్ ప్రారంభించిన వారే ఇదంతా చేస్తున్నారని తెలిపారు. వ్యాఖ్యాలు చేసిన తర్వాత ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకున్నారని చెప్పారు. తనకు బాగా కావల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదని, మాట్లాడిన మాటల్లో తప్పులు దొర్లాయని చెప్పారు. తాను ఏం తప్పు చేశానని తనపై ఇంత కోపమా అని ఆవేదన వ్యక్తం చేశారు. మీ అమ్మ నాన్న మీకు ఇంట్లో మీకు జాగ్రత్తలు చెప్పరా? అని అడిగారు. ఇంతకు ముందు ఇలాంటి వాఖ్యలు ఎవరూ చేయలేదా? వారి మీద ఇలానే మాట్లాడారా అని ప్రశ్నించారు. కమిషన్ అడిగిన వాటికి సమాధానం వివరణ ఇచ్చానని తెలిపారు. ఇంకా విచారణ ఉంటే కమిషన్ ముందుకు వస్తానని వెల్లడించారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాం అని శివాజీ విజ్ఞప్తి చేశారు.

శివాజీ చేసిన కామెంట్స్‌ను తప్పు పట్టిన నాగబాబు

శివాజీ చేసిన కామెంట్స్‌ను సినీ నటుడు, ఏపీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తప్పు పట్టారు. సమాజం పురుషాధిక్య ఆలోచనలతో నడుస్తోందని, వాటి నుంచి బయటకు రావాలని, మోడ్రన్ దుస్తులు ధరించడం తప్పు కాదని అన్నారు. మహిళలపై జరుగుతోన్న అత్యాచారాలు వారి డ్రెస్‌ల వల్ల కాదని, మగవాళ్ల క్రూరత్వం వల్ల అని అన్నారు. ఈ అంశంపై తన అభిప్రాయాన్ని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా స్పందించారు.

జనవరి 10 నుంచి సంక్రాంతి సెలవులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్27: రాష్ట్రంలో ఈ సారి సంక్రాంతి పండగకు వారం రోజుల పాటు సెలవులు రానున్నాయి. పాఠశాల విద్యాశాఖ గత మే నెలలో జనవరి 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సెలవులు ఉంటాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం తాజాగా 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగగా పేర్కొంది. జనవరి 10న రెండో శనివారం కూడా కలిసి రావడంతో ముందు ప్రకటించిన సెలవుల్ని అధికారులు పునః సమీక్షించారు. దీంతో జనవరి 10 నుంచి 16వ తేదీ వరకు సెలవులుగా నిర్ణయించారు. జనవరి 17 శనివారం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటనను వెలువరిస్తామని విద్యాశాఖ అధికార వర్గాలు తెలిపాయి.

రెండేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం, మహబూబాబాద్, డిసెంబర్27: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లే అయినా అప్పుడే తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇవాళ మహబూబాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన వారికి, స్వల్ప తేడాతో ఓడిన వారికి, పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో మాట్లాడుతూ కేటీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన గౌరవ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లకు శుభాకాంక్షలు. గెలిచిన వారికేగాక అధికార పార్టీ డబ్బును, ఆగడాలను ఎదిరించి తక్కువ ఓట్ల తేడాతో ఓడిన బీఆర్ఎస్ తరపు సర్పంచ్ అభ్యర్థులకు కూడా అభినందనలు తెలియజేస్తున్నా. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం అలుపెరగకుండా కృషిచేసిన కార్యకర్తలకు కూడా నా అభినందనలు. సాధారణంగా సర్పంచ్ ఎన్నికలకు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అధికార పార్టీకి అనుకూలంగానే ఫలితాలు వస్తాయి. అధికార పార్టీకి ఓటస్తే తమ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని ఓటర్లు ఆలోచిస్తారు. కానీ ఇయ్యాల తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీకి ధీటుగా బీఆర్ఎస్ తరపు అభ్యర్థులు కూడా విజయాలు సాధించారు' అన్నారు.'సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డంపెట్టుకుని తిమ్మినిబమ్మిని చేసే ప్రయత్నం చేసింది. స్వల్ప తేడాతో బీఆర్ఎస్ గెలిచిన చోట్ల రీ కౌంటింగ్ పేరు చెప్పి ఫలితాలను తారుమారు చేసింర్రు. కొన్ని ప్రాంతాల్లో ముందుగా బీఆర్ఎస్ గెలిచినట్లు చెప్పి.. తర్వాత కాంగ్రెస్ గెలిచినట్లు ప్రకటించారు. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే కాదు, దాదాపు అన్ని జిల్లాల్లో ఇలాంటివి జరిగాయి. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్ఎస్ మంచి ఫలితాలు రాబట్టిందంటే ప్రజల్లో మార్పు వచ్చిందని అర్థం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లే అయినా అప్పుడే తిరుగుబాటు మొదలైంది' అని కేటీఆర్ చెప్పారు.

సెకండరీ/టీచింగ్ ఆస్పత్రులకు కొత్తగా 784 మంది పీజీ వైద్యులు(సీనియర్ రెసిడెంట్స్) జనవరి 1 నుంచి రాబోతున్నారు. ఇటీవల పీజీ పూర్తి చేసిన వారికి పోస్టింగులు ఇవ్వనున్నాం. నోటిఫికేషన్ జారీ చేశాం, ఈ నెల 29 వరకు ఆప్షన్ల నమోదు కొనసాగుతుంది. వీరు 6 నెలలు బోధనాసుపత్రుల్లో, మరో 6 నెలలు సెకండరీ ఆసుపత్రుల్లో తప్పకుండా పనిచేయాల్సి ఉంటుంది.
- ఏపీ మంత్రి సత్యకుమార్

ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు

మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్ల లాభాలే ముఖ్యం అని ఖర్గే విమర్శించారు. యూపీఏ హయాంలో అమలైన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని ఖర్గే అన్నారు. ఎలాంటి అధ్యయనం లేకుండా రద్దు చేశారని మండిపడ్డారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల తరహాలో నేనని, రైతు ఉద్యమంలా దేశవ్యాప్త పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఎంజీనరేగాపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సభ్యులకు ఖర్గే సూచించారు.

ఈ యుద్ధంలో మనం గెలుస్తాం : ఖర్గే

"ఎంజీనరేగా రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఒక ఉద్యమం చేపట్టడం కోసం ఒక నిర్దిష్ట ప్రణాళికను రూపొందించడం మన సమష్టి బాధ్యత అని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జు ఖర్గే అన్నారు. ఈ యుద్ధంలో మనం గెలుస్తామని, ఈ క్లిష్ట సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. అంతకు ముందు, 2015 జనవరిలో కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని సవరించినప్పుడు, కాంగ్రెస్ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చారని. దీంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని అన్నారు. 2020 జూన్‌లో మోదీ మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని . వీటిని పార్లమెంటులో ప్రతిపక్షాలు వ్యతిరేకించాయని తెలిఆరు. 'అయిన ఈ చట్టాలు ఉభయసభల్లో ఆమోదం పొందాయి. ఈ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన 700 మందికి పైగా రైతులు చనిపోయారు. అప్పుడు మేము రైతులకు అండగా నిలిచాం. దీంతో 2021 నవంబర్‌లో ప్రధాని మోదీ రైతులకు క్షమాపణలు చెప్పి చట్టాలను రద్దు చేశారు. ఈ నల్ల చట్టాలను రద్దు చేస్తారని చాలా ముందుగానే రాహుల్ గాంధీ అంచనా వేశారు. ఎంజీనరేగాను మళ్లీ మోదీ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని కూడా రాహుల్ ఇటీవలే అంచనా వేశారు" అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

2026 ఎన్నికలకు సిద్ధం

కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని ఖర్గే తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని ఖర్గే చెప్పారు. 2026 ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని ఆయన ప్రకటించారు. ఎస్ఐఆర్‌పేరుతో ఓటర్ల హక్కులపై కుట్ర జరుగుతోందని, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల పేర్లు తొలగించొద్దని ఖర్గే హెచ్చరించారు. ఈడీ, ఐటీ, సీబీఐల దుర్వినియోగం జరుగుతోందని, నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బాంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులను ఖర్గే ఖండించారు. దేశంలో సామరస్యం దెబ్బతీసే ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రజా ఉద్యమానికి సిద్ధమని ఖర్గే ప్రకటించారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సహా అనేకమంది నాయకులు పాల్గొన్నారు. అయితే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఈ మీటింగ్ హాజరుకాలేదు. కొన్నాళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న శశిథరూర్ ఈ మీటింగ్‌కు హాజరయ్యారు.

ఈ యేడాది నేరాలు తగ్గాయి

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే రేప్ కేసులు తగ్గాయని.. మొత్తం 405 కేసులు నమోదైనట్లు తెలిపారు.

హత్య కేసులు తగ్గాయి

2024తో పోలిస్తే హత్య కేసులు తగ్గాయని.. 69 కేసులు రికార్డైనట్లు సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. కిడ్నాపింగ్ కేసుల విషయంలోనూ పోయిన సంవత్సరంతో పోలిస్తే తగ్గాయని, 166 మాత్రమే నమోదు అయ్యాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై 3,190, చీటింగ్ 4,536 కేసులు రికార్డ్ అయ్యాయని తెలిపారు. డ్రగ్స్ కేసులకు సంబంధించి గతేడాదితో పోలిస్తే కేసులు పెరిగాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ వ్యవహారంలో ఈ ఏడాది 368 కేసులు నమోదయ్యాయని.. 2,690 మంది నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో 26,379 ఫిర్యాదులు అందాయని.. రూ.319కోట్లు నష్టం, రూ.54 కోట్లను అధికారులు హోల్డ్ చేసినట్లు తెలిపారు. క్రైమ్ విషయంలో కమిషనరేట్ పరిధిలో మొత్తం 19,831 కేసులు నమోదయ్యాయని.. కోర్టులో 4,463మందికి శిక్షలు ఖరారైనట్లు తెలిపారు.

బీజేపీ పగ్గాలు నితిన్ నబిన్‌కే

మొదటిపేజీ తరువాయి

అమిత్ షా కూడా ప్రతిపాదకుడిగా సంతకం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పార్టీ ముఖ్య నేతలు ఆయనకు మద్దతు తెలపనున్నారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర అధ్యక్షులు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసి నితిన్ నబిన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తారు. మరో సెట్ నామినేషన్ పత్రాలను బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు దాఖలు చేస్తారని స్పష్టం చేశాయి.

సంస్థాగత ఎన్నికలు పూర్తి

జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ముందు జరగాల్సిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నిబంధనల ప్రకారం సగానికి పైగా రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తి కావాలి. దేశవ్యాప్తంగా ఉన్న 37 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు గాను, ఇప్పటికే 29 చోట్ల అంతర్గత ఎన్నికలు పూర్తయ్యాయి. మెజారిటీ రాష్ట్రాల్లో ప్రక్రియ ముగియడంతో జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు మార్గం సుగమమైంది. మిగిలిన రాష్ట్రాల్లోనూ ప్రక్రియ వేగంగా సాగుతోంది.

ఏకగ్రీవమే, పోటీ లేదు!

బీజేపీ సంప్రదాయం ప్రకారం అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవంగానే జరిగే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. అధ్యక్ష పదవికి నితిన్ నబిన్ ఒక్కరే నామినేషన్ వేసే అవకాశం కనిపిస్తోందని, వేరే ఎవరూ పోటీలో ఉండే అవకాశం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ (రిటర్నింగ్ అధికారి) కె. లక్ష్మణ్ నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల పరిశీలన అనంతరం నితిన్ నబిన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జనవరి 20న అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ ఘట్టానికి సాక్షులుగా నిలిచేందుకు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, రాష్ట్ర అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశాలు వెళ్లాయి.

యువ నాయకత్వానికి పట్టం

నితిన్ నబిన్ వయసు కేవలం 45 ఏళ్లు మాత్రమే. ఇంత చిన్న వయసులో జాతీయ పార్టీ పగ్గాలు చేపట్టడం విశేషం. పార్టీని భవిష్యత్తు కోసం సిద్ధం చేయడంలో భాగంగానే యువ నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తున్నారు. యువతకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్న సంకేతాలను దీని ద్వారా బీజేపీ పంపుతోంది. సీనియర్ల అనుభవం, యువకుల ఉత్సాహంతో పార్టీని ముందుకు నడిపించాలన్నదే అధిష్ఠానం యోచన.

2029 ఎన్నికలే లక్ష్యం

కొత్త అధ్యక్షుడి పదవీ కాలం, భవిష్యత్ కార్యాచరణపై కూడా స్పష్టత వచ్చింది. నితిన్ నబిన్ పదవీ కాలం జనవరి 2026 నుంచి ప్రారంభమై జనవరి 2029 వరకు ఉంటుంది. సాధారణంగా అధ్యక్ష పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది. అయితే 2029లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయన పదవీ కాలాన్ని 2029 తర్వాత కూడా పొడిగించే అవకాశం ఉందని సమాచారం.

ప్రజావసరాలు పెద్ద ఎత్తున తీరుస్తాం

మొదటిపేజీ తరువాయి

ప్రయాణం చేయాలంటే ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రైతులు పంటలు సాగు చేసేందుకు 24 గంటలు ఉచిత కరెంటు అన్నదాతలు పండించిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు కింటాకు 500 చొప్పున బోనస్, పనిచేసుకుంటాము అంటే వందరోజుల ఉపాధి కూలీ, ఆరోగ్యం బాగోలేదు అంటే ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచాం అన్ని సదుపాయాలు కల్పించి ఇది ప్రజల ప్రభుత్వం అనే నమ్మకం కలిగించాం కాబట్టే మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో 65% నుంచి 70 శాతం వరకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించి రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున ఆశీర్వదించారని తెలిపారు. ఆనాడు ఇందిరమ్మ ఇల్లు ఇస్తే ఒక గదిలో అల్లుడు వస్తే ఎక్కడ పడుకోవాలి, మేకలను ఎక్కడ కట్టివేయాలని అవహేళన చేసిన కేసీఆర్ మాయ మాటలు చెప్పి 10 సంవత్సరాలు పరిపాలించి అదిగో ఇదిగో అని ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని డిప్యూటీ సీఎం విమర్శించారు. కానీ ఇచ్చిన మాట మేరకు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదు లక్షలతో ఒక్కో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 22,500 కోట్లు ఖర్చు చేసి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం ప్రతి వారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే అది కాంగ్రెస్తోనే సాధ్యమని గత ఎన్నికల్లో మేమందరం విజ్ఞప్తి చేయగా రాష్ట్ర ప్రజలు ఆలోచించి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చారని తెలిపారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన వారు ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశారు, పాలన వ్యవస్థ ను గాడి తప్పించారు వారు అల్లకల్లోలం చేసినా కూడా ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలు ఎటువంటి ఆటంకం లేకుండా చేపడుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రాష్ట్రంలోని 96 లక్షల కుటుంబాలకు ఒక్కో మనిషికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 13,500 కోట్లు ప్రజల పక్షాన చెల్లిస్తుందని తెలిపారు. మహిళలంతా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు వారి పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ప్రతి నెల 8,600 కోట్లు చెల్లిస్తుంది అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి పంపిణీ చేస్తున్నాం, మహిళలను మహాలక్ష్మిలుగా చూసే ప్రభుత్వం వారికి మొదటి సంవత్సరం 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేసిందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో 65 శాతం కుటుంబాలకు 200 యూనిట్ల కింద ఉచిత విద్యుత్తు అందజేస్తున్నామని తెలిపారు.

పాలమూరు–రంగారెడ్డిపై నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

అడిగి తెలుసుకున్నారు. నాగర్ కర్నూల్ లో జరిగిన ప్రెస్ మీట్ లో మాట్లాడిన కవిత, కాళేశ్వరం మాదిరిగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పరుగులు పెట్టించకపోవడం వల్ల తెలంగాణకు రావాల్సిన 90 టీఎంసీల నీటి హక్కును కోల్పోయామని ఆరోపించారు. వరద నీళ్ల పేరుతో ఆంధ్రప్రదేశ్ నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ నిర్మిస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం కూడా అదే తరహాలో కొత్త ప్రాజెక్ట్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాలమూరు-రంగారెడ్డికి శ్రీశైలం నుంచి నీటి సోర్స్ తీసుకోవడం శాశ్వత జలవివాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. కొంచెం పనులు చేస్తే పూర్తయ్యే ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ అవినీతి జరుగుతోందని, వట్టెం రిజర్వాయర్‌లో నల్లమట్టి పేరుతో తీసుకున్న 900 ఎకరాల భూములు ఇప్పటికీ కాంట్రాక్టర్ల చేతిలోనే ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రికి నిజంగా దమ్ముంటే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పై జాగృతి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చిందని గుర్తు చేసిన కవిత, బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో ఎందుకు కోర్టుకు వెళ్లలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఎల్లూరు పంప్ హౌస్ విషయంలో అప్పటి మంత్రి హరీష్ రావు అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఓపెన్ ఎండ్ పంప్ హౌస్‌ను అండర్ గ్రౌండ్ క్లోజ్డ్ ఎండ్‌గా మార్చడం వల్ల మోటార్లు దెబ్బతిని, నీటి డ్రాయింగ్ సామర్థ్యం తగ్గిందని అన్నారు. అంచనా వ్యయం పెరిగినా నీళ్లు తగ్గిన పరిస్థితి ఎవరి ప్రయోజనం కోసం జరిగిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జిల్లా అభివృద్ధిపై మాట్లాడిన కవిత, తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నాగర్ కర్నూల్‌కు ఇప్పటికీ రైలు రాకపోవడం దురదృష్టకరమన్నారు. గద్వాల-మాచర్ల రైల్వే లైన్‌ను పూర్తి చేయాల్సిన బాధ్యత ఇక్కడి ఎంపీ తీసుకోవాలన్నారు. జిల్లాలో అటవీ భూములు అధికంగా ఉన్నప్పటికీ వనరుల వినియోగం జరగడం లేదని, పర్యాటక అవకాశాలు, కళలు, ఖనిజ వనరులు సరిగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అక్షరాస్యత కేవలం 54 శాతమే ఉండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్య, వైద్యం, సాగునీటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కవిత, మాతాశిశు కేంద్రంలోని ఎన్ఐసీయూలో నవజాత శిశువుల బెడ్స్ పై చీమలు తిరుగుతుండటం చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 350 పడకల ఆస్పత్రిగా విస్తరించినప్పటికీ శానిటేషన్ సిబ్బంది కొరతతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, వెంటనే సిబ్బంది సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పరిశీలన అనంతరం కవిత మాట్లాడుతూ ఎల్లూరు పంప్ హౌస్‌లో పగుళ్లు, మోటార్ల వైఫల్యం, నార్లపూర్ రిజర్వాయర్ సామర్థ్యం తగ్గింపుపై తీవ్ర విమర్శలు చేశారు. పనులు పూర్తి కాకపోయినా వ్యయం పెరిగిందని, ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు, పరిహారం ఇవ్వకుండానే నీళ్లు నింపడం అన్యాయమన్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి స్కీమ్‌లను రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి పోరాటం సామాజిక తెలంగాణ సాధన కోసమేనని కవిత స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా, ఆర్థికంగా న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, ప్రజల సమస్యలపై కమిటీలు వేసి ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.

ఇంకా అలాగే ఎరుకల కులస్తుల జీవన స్థితిగతులు

స్వాతంత్ర్యం రాకముందు ఎట్లా జీవన పరిస్థితులు ఉన్నాయో ఇప్పటికీ ఎరుకల కులస్తుల పరిస్థితి అలాగే ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అయినా వారి స్థితిగతులు మెరుగుపడాల్సి ఉండగా, ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని అన్నారు. ఎరుకల నివాస ప్రాంతాల్లో చిన్న గుడిసెలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, రావాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు చాలామందికి అందలేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా కొందరికే మంజూరయ్యాయని అక్కడి ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. అయితే అక్షరాస్యత కేవలం 54 శాతం మాత్రమే ఉన్న ప్రాంతంలో కూడా కొంతమంది ఆడపిల్లలు డిగ్రీ వరకు చదవడం సంతోషకరమైన విషయమని కవిత అన్నారు. ఎంత కష్టాలు ఎదురైనా చదువును మాత్రం ఆపవద్దని, ఒకసారి చదువుకుంటే అదే జీవితాంతం మనకు తోడుగా ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ఆదివాసీ, గిరిజన విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న లోకిని రాజు జాగృతి విభాగానికి కూడా అధ్యక్షులుగా ఉన్నారని తెలిపారు. అయితే ఆదివాసీ, గిరిజన విభాగాల్లో ఇప్పటివరకు ఎరుకల వారికి సరైన అవకాశాలు ఇవ్వలేదన్న వాదన ఉందని పేర్కొన్నారు. ఏకలవ్యుడిని దేవుడిగా భావించే ఎరుకల వారి నైపుణ్యాలు అన్ని ఆదివాసీ పిల్లలకు విస్తరించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో ఆదివాసీ, గిరిజన భవన్ నిర్మాణం పూర్తయిందని, త్వరగా ప్రారంభోత్సవం నిర్వహించాలని కోరారు. ఒక్కో సమస్యను దశలవారీగా పరిష్కరించే దిశగా జాగృతి సంస్థ ప్రయత్నిస్తోందని, ఈ పోరాటానికి ప్రజలందరి మద్దతు అవసరమని కవిత విజ్ఞప్తి చేశారు.

వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు

- డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- డెస్క్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ డిమాండ్
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున నిరసన, వినపత్రం అందజేత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్27: వర్కింగ్ జర్నలిస్టులను అక్రెడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ(డీజేఎఫ్‌టీ) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్, కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ పత్రికలకు చెందిన డెస్క్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్లు అవుతుందని స్పష్టం చేశారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే జర్నలిజం అవుతుందని చెప్పారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను రెండో గ్రేడ్ వారిగా మార్చొద్దని చెప్పారు. అలాగే జీవో నంబర్ 252ను సవరించాలని, స్పోర్ట్స్, సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలోలాగా అక్రెడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కదిరవన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కేవీ రాజారామ్, డీజేఎఫ్‌టీ కోశాధికారి నిసార్, జాయింట్ సెక్రటరీ విజయ తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎస్‌జాట్ మద్దతు...

డీజేఎఫ్‌టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర నాయకులు మాణిక్యప్రభు గుర్రంపల్లి, రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, ప్రధాన కార్యదర్శి జగదీశ్ తదితరులు మద్దతు తెలిపారు. ఎస్‌జాట్ తదితర జర్నలిస్టు సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.

ఎవరూ ఆందోళన చెందొద్దు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ

డెస్క్ జర్నలిస్టులకూ గతంలోలాగే అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు శనివారం మహబూబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. వారి వెంట టీడబ్ల్యూజేఫ్ నేతలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే డెస్క్ జర్నలిస్టుల పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతులపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడతానని వెల్లడించారు. జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ)కమిటీ కన్వీనర్ కాంకూరి వెంకటేశ్వరరావు, కోకన్వీనర్లు కేతిరెడ్డి అచ్చిరెడ్డి, వంశీ, శాబాదు కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలంగాణ టెట్ హాల్‌టికెట్లు విడుదల

- జనవరి 3 నుంచి 20 వరకు పరీక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 27: తెలంగాణ టెట్ 2026 హాల్‌టికెట్లు శనివారం విడుదలయ్యాయి. ఈ మేరకు విద్యాశాఖ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ వివరాలతో లాగిన్ అయిన తర్వాత హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక టెట్ ఆన్‌లైన్ రాత పరీక్షలు జనవరి 3, 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో రోజుకు రెండు సెషన్లలో జరగనున్నాయి. ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ ఆన్‌లైన్ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి సెషన్ పరీక్షకు అభ్యర్థులకు 2 గంటల 30 నిమిషాల సమయం ఉంటుంది. జిల్లా వారీగా ఏ రోజు ఏ జిల్లా అభ్యర్థులకు ఏయే పరీక్షలు ఉంటాయో తెలుపుతూ పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో షెడ్యూల్‌ను పొందుపరిచింది. అభ్యర్థులు తమ పరీక్షా తేదీ, సమయం, కేంద్రాన్ని తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌ను సందర్శించి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

బీసీ రిజర్వేషన్స్ 42 శతం పెంచిన తర్వాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలి

- సర్పంచుల గౌరవ వేతనాన్ని 20 వేల వరకు పెంచాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 27 : రిజర్వేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినప్పటికీ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీసీలు 50 శాతానికి పైగా సర్పంచులు, వార్డు మెంబర్లు గెలిచి తమ సత్తా చాటారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చినట్లయితే ఇంకా 10 శాతం సీట్లు గెలుచుకునే వారని అన్నారు. హడావుడిగా సర్పంచ్ ఎన్నిక నిర్వహించి ఇందులో కేవలం పదిహేడు శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించారని, దీంతో ప్రజలు తిరగబడి బీసీలకు అత్యధికంగా పట్టం కట్టారని అన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ జరిపిన బంద్ వల్ల ప్రజల్లో చైతన్యం పెరిగిందని దాంతోటే ఎన్ని ఎన్నికల్లో సర్పంచులు గెలిచారన్నారు. అగ్రకులాల వారు వివిధ పార్టీల వారు బిసి సర్పంచ్ లను బెదిరిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ఖబర్దార్ బీసీ వ్యతిరేకుల్లారా ఖబర్దార్ అని కృష్ణయ్య హెచ్చరించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే జరపాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. వీటికి సంబంధించి కోర్టులో కేసు బలంగా ఉందని, బీసీల వైపే న్యాయం గెలుస్తుంది అన్నారు. కోర్టు తీర్పు వ్యతిరికంగా వస్తే రాష్ట్రం అగ్గి కుండంగా మారుతుందని కృష్ణయ్య హెచ్చరించారు. వచ్చే నెల జూన్ నుండి దేశ వ్యాప్తంగా బీసీల జనగణన జరగబోతున్నట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. దేశాన్ని బీసీలకు అప్పగించిన ఘనత మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానిదన్నారు. మోడీ హయాంలోనే చట్టసభల్లో రిజిస్ట్రేషన్లు వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కోర్ట్ తీర్పు వచ్చేవరకు జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్ళకూడదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచులకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని 6500 నుంచి 20వేల వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

పెరియార్ సభకు తరలిరండి

- జన జాగృతి కళా సమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్27: సమాజాన్ని వాస్తవికత వైపు మళ్ళించే ప్రయత్నంలో జీవితాంతం పోరాటం చేసిన పెరియార్ ఈవీ రామస్వామి వర్ధంతి సభకు మేధావులు తరలిరావాలని జన జాగృతి కళా సమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో పెరియార్ వర్ధంతి సభ జరుగుతున్న నేపథ్యంలో హుస్నాబాద్ నుంచి పెరియార్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సంపత్ కోరారు. శనివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట దళిత సంఘాల నాయకులు కొలువురు అశోక్, బోయిని రాజశేఖర్, ఆనందం తదితరులున్నారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య ఎన్టీఆర్ విద్యాసంస్థల లక్ష్యం

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 27: పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చడమే ఎన్టీఆర్ ట్రస్ట్ ముఖ్య లక్ష్యమని.. రాజకీయంగా నాయకులు అకాల మరణంతో మృతి చెందిన పిల్లలు అనాధలు కాకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యాసంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి అన్నారు. శనివార రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ సమీపంలోగల గండిపేట కుటీరం ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యాసంస్థల్లో వార్షికోత్సవాన్ని ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. వేదికపై ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చడమే ఎన్టీఆర్ విద్యాసంస్థల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా 2005లో అప్పుడు పదవ తరగతి వరకు విద్యాసంస్థను ప్రారంభించడం జరిగిందని, ట్రస్ట్ చైర్మన్ గా నార భువనేశ్వరి ఏర్పాటు అయ్యారన్నారు. ఆ తర్వాత భువనేశ్వరి ఆధ్వర్యంలో మొక్కగా ఏర్పాటుచేసిన ఈ ట్రస్ట్ విద్యాసంస్థ నేడు వృక్షంగా ఇంటర్ డిగ్రీ తో ఎదగడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యాసంస్థల్లో చదివి వెళ్లిన ఎంతోమంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నతమైన స్థానంలో ఉద్యోగాలు చేస్తుండడం, ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీలుగా ఉద్యోగాలు సంపాదించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు సి ఓ ఓ, గోపి డి రామారావు, ప్రిన్సిపల్ ఎస్ జె రెడ్డి. నాయకులు టిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు కంజర్ల భాస్కర్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్, తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల పోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లితిరుపతిరెడ్డి, సిఆర్ యాదవ్, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య, అధ్యాపకులు విద్యార్థులు తల్లిదండ్రులు నాయకులు పలువురు పాల్గొన్నారు.

గండిపేటకు వస్తుంటే చాలా గుర్తుకువస్తున్నాయి.. చంద్రబాబు.

తెలుగుదేశం పార్టీ అంటే యువతను రాజకీయంగా ఎదిగేందుకు కృషిచేసిన కేంద్రం ఎన్టీఆర్ ట్రస్ట్ గండిపేట కుటీరమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఈరోజు గండిపేటకు వస్తుంటే ఆనాటి జ్ఞాపకాలు ఎన్నో గుర్తొస్తున్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి హెడ్ క్వార్టర్స్ రాజకీయ శిక్షణ కేంద్రం హిమాయత్ నగర్ కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు. 1997లో ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారని, యువతను రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. అప్పుడు శిక్షణ కేంద్రం అయితే ప్రస్తుతం 2005లో విద్యను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- అయ్యప్ప స్వాములతో కలిసి 'పేటతుళ్లి' ఆడిన మంత్రి పొన్నం
- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రతిపక్షం,హుస్నాబాద్, డిసెంబర్ 27: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర గుట్టపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం జరిగిన ఈ వేడుకకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వాములతో కలిసి మంత్రి భక్తిశ్రద్ధలతో 'పేట తుళ్లి' (భజన నృత్యం) ఆడటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ కావాలని అయ్యప్ప స్వాములు కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అక్కడికక్కడే కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. దేవాలయం, భక్తి విషయాల్లో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఉండాలని మంత్రి అన్నారు. హుస్నాబాద్ ప్రాంతం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తామని, భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఉద్యమ స్ఫూర్తితో రాజకీయాల్లోకి..

- బీసీలకు 42% శాతం రిజర్వేషన్ కోసం పోరాటం
- బీసీ సామాజిక వర్గానికి చెందిన పిడిశెట్టి రాజు
- జడ్పీటీసీ ఎన్నికల బరిలో దిగే అవకాశం

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్27: బీసీ సామాజిక వర్గానికి చెందిన పిడిశెట్టి రాజు ఉద్యమ స్ఫూర్తితో రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. విద్యార్థి దశలోనే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న అయిన 1999 నుంచి 2006వరకు ఎన్ఎస్యూఐల్లో పని చేశారు. 2007ఎస్ఈఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారు. అనంతరం 2010 వరకు బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా కొనసాగుతూ స్కాలర్ షిప్లు, హాస్టల్ వసతులు, డిగ్రీ కళాశాల్లో కోర్సుల విస్తరణ వంటి అంశాలపై అనేక ఉద్యమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడిగా, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేసిన పిడిశెట్టి రాజు అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మద్దతూ ప్రకటించి విజయానికి దోహదపడ్డారు. బీసీలకు 42% శాతం రిజర్వేషన్ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నా ఉద్యమకారుడు గా గుర్తింపు పొందిన పిడిశెట్టి రాజు, రాబోయే జడ్పీటీసీ ఎన్నికల్లో బరిలో దిగే అవకాశం ఉందని బీసీ నేతలు పేర్కొంటున్నారు.

సీఎస్ఈలో స్వరాజ్‌కు పీహెచ్‌డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 27 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి ఎస్. స్వరాజ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ ద్వారా ద్రాక్ష సాగులో విప్లవాత్మక మార్పుల'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అపర్ణ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ స్వరాజ్ పరిశోధన, మొక్కల వ్యాధుల ముందస్తు గుర్తింపు, తీవ్రత వర్గీకరణ కోసం అధునాతన ఏఐ ఆధారిత హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. ఆప్టిమైజ్డ్ బ్యాండ్ ఎంపిక, ఫజీ సెగ్మెంటేషన్, ఐవోటీ ఆధారిత వాస్తవ సమయ పర్యవేక్షణతో డీప్ లెర్నింగ్ మోడళ్లను సమగ్రపరచడం ద్వారా, ప్రతిపాదిత వ్యవస్థ వ్యాధి గుర్తింపు, తీవ్రత అంచనాలో అధిక ఖచ్చితత్వాన్ని సాధించడంతో పాటు సకాలంలో పంట రక్షణ, మెరుగైన వ్యవసాయ ఉత్పాదకతకు మద్దతు ఇస్తుందని వివరించారు. ఈ అధ్యయనం అద్భుతమైన పనితీరును ప్రదర్శిస్తోందని, 93 శాతం కంటే ఎక్కువ ఖచ్చితత్వాన్ని సాధిస్తుందని తెలిపారు. మొక్కల వ్యాధి పర్యవేక్షణ కోసం తెలివైన, సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తోందని వెల్లడించారు. డాక్టర్ స్వరాజ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన పటాన్‌చెరు బీఆర్ఎస్ నేతలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 27: హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆధర్శ్ రెడ్డి , భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆధర్శ్ రెడ్డి , తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి , పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి జీహెచ్ఎంసీ వార్డు డీలిమిటేషన్ కారణంగా ఉత్పన్నమవుతున్న సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల ఇబ్బందులను వివరిస్తూ మూడు ముఖ్య వినతిపత్రాలను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ తరఫున అధికారికంగా కమిషనర్‌కు సమర్పించారు. ప్రస్తుతం ఉన్న అమీన్‌పూర్ సర్కిల్ పేరును సరిపడా మౌలిక వసతులతో పాటు ప్రధాన రహదారిపై ఉన్న, సులభంగా చేరుకునే రామచంద్రపురం సర్కిల్‌గా మార్చాలని కోరారు. అక్కడ ఉన్న ఎంపీడిఓ కార్యాలయంలో తగిన స్థలం కూడా అందుబాటులో ఉందని, ముఖ్యంగా డివిజన్‌లోని వృద్ధులకు అమీన్‌పూర్‌కు వెళ్లడం చాలా కష్టంగా మారనుంది అని వివరించారు.అలాగే భౌగోళికంగా తెల్లాపూర్‌కు సమీపంలో ఉన్న వేలిమల గ్రామాన్ని పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా తెల్లాపూర్ డివిజన్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీలో భాగంగా ఉన్న విద్యుత్‌నగర్ కాలనీ ప్రస్తుతం తెల్లాపూర్, భారతి నగర్ డివిజన్లుగా విడిపోయి ఉండటంతో పరిపాలనా మరియు మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తుతున్నాయని, కావున మొత్తం విద్యుత్‌నగర్ కాలనీని తెల్లాపూర్ డివిజన్‌లో చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ తొంట ఆంజయ్య , కుమార్ గౌడ్ , తెల్లాపూర్ కౌన్సిలర్ రవీందర్ రెడ్డి , సర్కిల్ ప్రెసిడెంట్ పరమేష్ యాదవ్, బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్ చిన్నా, శ్రీకాంత్ రెడ్డి , అప్పల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ వినతులపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఆర్.వి. కర్ణన్ , సంబంధిత అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

"

గత పాలకులు తెలంగాణను దోచుకున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదవాళ్ల సొంతింటి కలను నిజం చేస్తున్నాం. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని ప్రారంభిస్తాం. రాబోయే మూడేళ్లలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేస్తాం.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
ఆదివారం
28.12.2025
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

కాంగ్రెస్, బీఆర్ఎస్ యుద్ధం.. అసెంబ్లీ వేదిక

హైదరాబాద్,

ఆదివారం
28.12.2025

తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారబోతున్నాయి. స్థానిక ఎన్నికలు ఆసక్తికరంగా సాగాయి. ప్రజలు అన్ని గమనిస్తూనే జరుగుతున్న పరిణామాలను ఆసక్తికరంగా చూస్తున్నారు. ఇప్పట్లో ఎన్నికలు లేవు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు. ప్రభుత్వం ప్రాదేశిక, మున్సిపల్ ఎన్నికలకు ఎప్పుడు వెలుతుందో తెలియది. ఇంకా స్థానిక ఎన్నికల హడావుడి నుంచి రాష్ట్ర ప్రజలు బయటికి రాలేదు. రాష్ట్రంలో రాజకీయం మళ్లీ వేడెక్కింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న రాజకీయ పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. ఈ నెల 29 నుంచి తెలంగాణ అసెంబ్లీ ప్రారంభం కానుంది. ఈ సమావేశాలకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఎర్రవల్లి క్షేత్రంలో మాజీ మంత్రులతో కేసీఆర్ మాట్లాడారు. ఈ నేపథ్యంలో తాను అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్నట్టు వారితో చెప్పారు. ఈ వార్త తెలంగాణ రాజకీయ వర్గాలలో విపరీతమైన చర్చకు దారితీసింది. అసెంబ్లీకి వచ్చి, కాంగ్రెస్ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కేసీఆర్ ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది. అటు కాలేశ్వరం దగ్గర నుంచి మొదలు పెడితే ఫోన్ ట్యాపింగ్ వరకు ప్రతి వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావును ఇరుకున పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. కేసీఆర్ ను అసెంబ్లీకి రావాలని సవాల్‌కూడా చేశారు. అయితే ప్రతి కేసులోనూ ఆరంభ శూరత్వం మాత్రమే కనిపిస్తోంది. అయితే ఈ సారి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ ను గట్టిగా ఫిక్స్ చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందువల్లే ఈ కేసును సజ్జనార్ కు అప్పగించారు. దీంతో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ప్రభాకర్ రావు నుంచి మొదలు పెడితే తిరుపతి వరకు అందరిని విచారించింది. కేసీఆర్ కు నోటీసులు కూడా పంపింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ చాలా రోజుల తర్వాత మీడియా ముందుకు వచ్చారు. కాంగ్రెస్ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అంతేకాదు, ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నిర్మించే పాలమూరు, రంగారెడ్డి పథకంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం తోలు తీస్తానని హెచ్చరించారు. అవసరమైతే ఉద్యమం కూడా చేపడతానని స్పష్టం చేశారు. అటు రేవంత్ రెడ్డి కూడా ఈ విమర్శలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ముందు నీకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. వాస్తవానికి 2023లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కేసీఆర్ రెండు పర్యాయాలు మాత్రమే అసెంబ్లీకి వచ్చారు. సుదీర్ఘకాలం ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అసెంబ్లీకి కేసీఆర్ రావడం చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కేసీఆర్ గనక సభలో పూర్తిస్థాయిలో ఉంటే, చర్చ అర్ధవంతంగా, ఆసక్తికరంగా సాగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

చరిత్రలో లిఖించని అణగారిన కులాల త్యాగాలు, బలిదానాలు

సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారత స్వాతంత్య్ర ఉద్యమ చరిత్ర విశిష్టమైనది. ఆంగ్లేయులపై పోరాడిన వీరులుగా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, రాణి లక్ష్మీబాయి, బాల గంగాధర్ తిలక్ వంటి ఆధిపత్య కులాల వాళ్ల పేర్లనే కీర్తిస్తుంటాం. వారినే సంఘసంస్కర్తలుగా, జాతి నాయకులు, వీరులుగా చరిత్రలో లిఖించారు. మెజార్టీ ప్రజలైన బహుజనుల వీరత్వం, పోరాటాలకు స్థానం లేదు. భారతదేశ చరిత్రలు తిరగేస్తే అణగారిన కులాల మహిళలు, పురుషుల పోరాటాలు కనిపించవు. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన వారు వీరనారి ఝల్కారీ బాయి, సర్దార్ ఉదం సింగ్ చమార్. దేశ చరిత్రలో ఒకరేమో మొదటి స్వాతంత్ర ఉద్యమ తిరుగుబాటులో పోరాడితే మరొకరు జలియన్ వాలాబాగ్ ఉదంతంపై పోరాడి పశువులు బాసారు. ఇది చరిత్రకు ఎక్కకపోవడం శోచనీయం.

లిఖించని ఝల్కారీ బాయి వీరత్వం

ఆంగ్లేయులతో వీరోచిత పోరాటం చేసిన వీరవనిత ఝల్కారీ బాయి 1857 తిరుగుబాటు చరిత్రకు అందకుండా పోయింది. అగ్రకుల ఆధిపత్యం కారణంగా-బ్రిటీష్ సైన్యంతో తలపడని, ఎదుర్కొని ఝాన్సీరాణి లక్ష్మీబాయి వీరవనితగా చరిత్రలో నిలిస్తే, ప్రాణాలు పణంగా పెట్టి యుద్ధం చేసిన వీరనారి ఝల్కారీబాయి దళిత కులానికి చెందిన కారణంగా చరిత్రలో లేకుండా పోయింది. ఆమె ఝాన్సీలక్ష్మీభాయి ఏర్పాటు చేసిన మహిళా సైన్యంలో కమాండర్. 1857 స్వాతంత్య్ర సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి సైన్యంలో ఆమెకు సమానంగా సాహసంగా రాణి రూపంలో బ్రిటిష్ సైనికులతో పోరాడిన దీరవనిత. యుద్ధంలో, ఝల్కారీ బాయి తనని రాణిగా మోసగించి బ్రిటిష్ సైన్యాన్ని గందరగోళానికి గురిచేసి లక్ష్మీబాయికి సురక్షితంగా తప్పించుకునే అవకాశాన్ని కల్పించి కాపాడింది. ఇక్కడ నిజమైన యుద్ధాన్ని చేసిన మహిళ ఝల్కారీ బాయి కదా. కానీ చరిత్ర పుస్తకాల్లో లక్ష్మీబాయినీ వీర వనితగా చిత్రీకరించిన గమనార్హం.

ఉద్ధం సింగ్ చమార్ త్యాగాన్ని మరిచిన చరిత్ర

భారత స్వాతంత్ర చరిత్రలో జలియన్ వాలాబాగ్ ఉదంతం అత్యంత హేయమైన సంఘటన. పంజాబ్ రాష్ట్రంలో అమృత్‌సర్ పట్టణంలో జలియన్ వాలాబాగ్ మైదానంలో 1919 ఏప్రిల్ 13న డాక్టర్ సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూ అరెస్టులకు నిరసనగా వేలాది ప్రజలు సమావేశయ్యారని, ఇది అనాడు రౌలట్ చట్టానికి నిరసన సమావేశమని బ్రిటీష్ వారికి తెలియడంతో బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ డైర్ ఆదేశాల మేరకు సైనికులు అక్కడ ప్రజలపై కాల్పులు జరిపినట్లు చరిత్ర చెబుతుంది. ఈ చర్యకు పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ.డయ్యర్ మద్దతు పలికాడని, ఈ ఉదంతంలో ఉద్ధం సింగ్ స్నేహితులు చనిపోవడంతో ప్రతీకారంగా ఆయన 1940 మార్చి 13న లండన్ కాక్స్టన్ హాల్‌లో గవర్నర్ మైఖేల్ ఓ.డ్వయర్‌ను కాల్చిచంపినట్లు చెబుతారు. గవర్నర్ హత్యను "నా దేశం, ప్రజల కోసం" అని ప్రకటించి ఉద్ధం సింగ్ 1940 జులై 31న లండన్ పెంటోన్‌విల్



జైలులో ఉరికంభమేక్కి "షహీద్‌ఎఅజమ్" (గొప్ప అమర వీరుడు) నిలిచాడు. సర్దార్ ఉద్ధం సింగ్ చమార్ (దళిత) కులానికి చెందిన రవిదాసియా సిక్కు. ఉద్ధం సింగ్ గద్దర్ పార్టీ, హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ లో చేరి విప్లవ కార్యకలాపాలు నడిపాడు. వాస్తవ చరిత్ర కోణాన్ని పరిశీలిస్తే...ఉద్ధం సింగ్ కులవ్యవస్థ, బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా సమానత్వాన్ని బోధించిన దళిత సిక్కు మతస్థుడు. ఇందులో సంత్ రవిదాస్ బోధనలు కూడా ఉన్నాయి. 1699లో గురు గోబింద్ సింగ్ ఖాల్సా పంథ్‌ను స్థాపించిన రోజుగా వైశాఖిని (బైశాఖి) జరుపుకుంటారు. ప్రతి ఏటా ఆ రోజు పంజాబీలో కరాహ్ ప్రసాదం (తీపి ప్రసాదం) పంచుతారు. దళిత సిక్కులు ఈ ప్రసాదాన్ని పంచడానికి అగ్రకుల బ్రాహ్మణ సిక్కులు అనుమతించకపోవడంతో వేలాది దళిత సిక్కులు 1919 ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ మైదానంలో సమావేశమైనారు. ఈ సమావేశాన్ని అగ్రకుల బ్రాహ్మణ సిక్కులు బ్రిటిష్ వారిపై దాడికి యత్నిస్తున్నారని తప్పుడు సమాచారమివ్వడంతో బ్రిటిష్ ఆర్మీ అధికారి డైర్ కాల్పులకు ఆదేశించాడు. పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మైఖేల్ ఓ' డయ్యర్ ఈ దుర్ఘటనకు మద్దతు పలికి కారణమయ్యాడు. జలియన్ వాలాబాగ్ మైదానంలో వాలంటీర్ గా పనిచేసిన ఉద్ధం సింగ్ తన కళ్ళెదుట అసువులు బాసిన తమ వాళ్ళను చూసి చలించాడు. ఆయన లండన్ వెళ్ళి మైఖేల్ ఓ'డయ్యర్ ను హత్య చేశాడు. దళిత విప్లవకారుడి పగ ప్రతీకారానికి నిదర్శనం. ఇది భారత స్వాతంత్య్ర ఉద్యమంలో దళితుల భాగస్వామ్యం, దేశభక్తి, త్యాగం గుర్తుచేస్తుంది. అసలు జలియన్ వాలాబాగ్ కుట్రపూరిత ఉదంతంగా చెప్పవచ్చు.

బహుజనుల త్యాగాలకు స్థానం ఏది?

భారతదేశ చరిత్ర అంతా గెలిచిన వారిదే. ఇక్కడ ఆధిపత్య కులాల పాత్రలే చరిత్రలో కనబడతాయి. వివక్షత కారణంగా అణగారిన కులాల త్యాగాలు, బలిదానాలు, చరిత్ర అంచుల్ని కూడా తాకలేదు. పూలే, అంబేడ్కర్, కాన్సిరాం సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాటంతో వాస్తవ చరిత్ర బయటకు వచ్చింది. ఉద్ధం సింగ్ చరిత్ర, ఝల్కారీ బాయి ఇందుకు నిదర్శనం. జలియన్ వాలాబాగ్ దుర్ఘటన, అందులో మరణించిన వారు, ఆ మరణాలపై ప్రతీకారం తీసుకున్న పోరాట యోధుని చరిత్రపై మిస్టరీగానే మిగిలిపోయింది. తప్పుడు చరిత్రల వల్ల ఉద్ధం సింగ్, ఝల్కారీ బాయి వంటి ఎస్సీ, ఎస్టీ, బీసీల పరాక్రమం, పోరాట గాథలు ఈ సమాజానికి అందకుండా పోయాయి. నాటి అగ్రకుల నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమం నుంచి కమ్యూనిస్టు పోరాటం, తెలంగాణ ఉద్యమం వరకు బహుజనులను ముడిసరుకుగా వాడారు. కానీ ఆ జాతి నాయకుల పోరాటాన్నీ చెప్పకపోవడం బాధాకరం. అదే నెహ్రూను కాశ్మీర్ బ్రాహ్మణడనీ గాంధీని గుజరాత్ వైశ్యడనీ చరిత్రలో పరిచయం చేసి అగ్రకులాలు చైతన్యమయ్యారు. కానీ ఉద్ధం సింగ్, ఝల్కారీ బాయి వంటి అట్టడుగు వర్గాల వీరత్వాన్ని చూపెట్టలేదు. దీంతో దళిత, బహుజనుల త్యాగాలు, పోరాటాలు మనకు తెలియకపోవడంతో వారినుంచి ప్రేరణ పొందలేకపోయాం. ఈ క్రమంలో కాన్షిరాం చరిత్రలో స్థానమీవ్వని ఝల్కారీ బాయి, ఉద్ధం సింగ్ చమార్ వీరత్వాన్ని బహుజన ఉద్యమంలో పరిచయం చేశాడు. ఆయన ఝాన్సీలో ఝల్కారీ బాయి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. మాయావతి ఉద్ధం సింగ్ పేరుమీదనే ఉత్తరప్రదేశ్ లో ఒక జిల్లాను ఏర్పాటు చేసి ఆయనకు నివాళి అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో డాక్టర్ విశారదన్ మహారాజ్ సర్దార్ ఉద్ధం సింగ్ చమార్, ఝల్కారీ బాయి లను పరిచయం చేసి దళితుల్లో చైతన్యాగ్నిని రగిలించాడు. ఆది జాంబవంతు నుంచి, అంబేద్కర్ వరకు ఈ మట్టిపై పుట్టిన ఎందరో బహుజన పరాక్రమ వీరుల చరిత్రతో ప్రేరణ పొంది విముక్తి వైపు ప్రయాణించాలి.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

కలవరాల 'టూఫైటూ' కావొద్దు కలం 'పోటు'

ఇల్లెందుల దుర్గాప్రసాద్
9440850384

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారూ! ఉ'దారం' పోగులు తెగిపోకుండా చూడండి. నిరసనల అవసరం పడనీయకండి. కార్మికుల హక్కుల మాదిరే జర్నలిస్ట్ కామ్రేడ్ల మంచి చెడులు చూడండి. తద్వారా ప్రజాపాలన అనే బ్రాండ్ మసకబారకుండా కాంతిమంతం చేయండి. యవ్వన ప్రాయంలో ఆల్రెడీ ఎంతోకొంత పాత్రికేయ రంగంలో ప్రవేశ అనుభవంతోనైనా జర్నలిస్టుల స్థానంలో క్షణం మనసు నిలిపి సానుకూల సదాలోచన చేయండి. యజమానుల వలే లాభనష్టాలకు అతీతమైన సింహభాగం జర్నలిస్టుల జీవితాలు కనీసం లక్షలకూ పడగలెత్తని లక్కులేని వెతలే. అత్తెసరు, అంతకంటే తక్కువ వేతనాలే. ఎందరికో ఆ మాత్రమూ శూన్యమే. పొలిటికల్ వారికి రాజకీయాలు ఎలానో, ప్రొఫెషనల్ జర్నలిస్టులకు జర్నలిజం అలానే ఇష్టం. గుమ్మడికాయంత సైజు, బరువూ, భారం ఏమీ మన 'ఇందిరమ్మ రాజ్యం' మీద పడదు. ఆ బరువూ, భారం వజను జస్ట్ ఆవగింజకు మించి ఉండదు అన్నా! మీ 2047 విజన్ విశాల దృక్పథం, హృదయానికి మీడియా కామ్రేడ్ల పట్ల అనుకూల పంథాను జోడించండి. జర్నలిస్టులు క్షేమంగా ఉంటే, కనీసం పాతిక వేల కుటుంబాలూ ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం జాబితాలో చేరినట్లే కదా. తమ ప్రతిఘటన వల్లే రేవంత్ సర్కారు దిగి వచ్చిందనే 'అచ్చు/దృశ్యం' ఎందుకూ? మెజారిటీ జర్నలిస్టులు జీవో టు ఫై టు (252) పట్ల కలవరంతో ఉన్నారు. ఏమాత్రం సంతృప్తిగా, సంతోషంగా లేరు. వారిలో "మన వాళ్ళూ, తన వాళ్ళూ" ఉన్నారు! పైగా ఎవరెవరికి అక్రెడిటేషన్లు దక్కవనే ఊహల లెక్కలు, సమాంతర లబ్ధిపై అపోహలు వ్యాప్తిలోకి వస్తున్నాయి. రాజకీయ నాయకులకు "పోస్టు/పదవి" అనేది ఎలాగో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ దాదాపు అలాంటిదే! అక్రెడిటేషన్ అంటేనే "గుర్తింపు". సంఘాలు, యూనియన్లలో సర్వసాధారణంగా ఉన్నట్టే... భిన్నాభిప్రాయాలు, ఒకింత మనో వికారాలు సహజం. వాటిని బేస్ చేసుకుని, విధాన నిర్ణయాలు తీసుకోవచ్చా, వాస్తవిక దృష్టి, దృక్పథం సరైనదా? మీ సహచర మంత్రి పొంగులేటితో వన్ టూ వన్ ప్రశాంతంగా, న్యూట్రల్ గా పునఃచర్చ చేయండి. ఎందుకంటే, ఈ వ్యవహారం కనీసం 23 వేల మంది జర్నలిస్టుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్నది. జర్నలిస్టులుగా మాకు ఓ రాయితీ బస్ పాస్, జానెడంత జాగా, ఇంత ఆరోగ్య బీమా, కొంత వెల్ఫేర్ వగైరా ఒనగూ

పాత్రికేయ, సంపాదక పెద్దలే మీ చల్లని చూపుల పరిధిలో ఉండాలనీ, ఉన్నారని నా విశ్వాసం. వాదనలూ, కోణాలూ, దృక్పథాలూ ఎపుడూ ఉంటాయి. అవి అందరితోనూ మ్యాచ్ కావాలనీ ఏమీ లేదు. మార్కండేయ అనే సీనియర్ జర్నలిస్టుకు గత ప్రభుత్వంలో అక్రెడిటేషన్ రాలేదు. మీ ప్రభుత్వం రావడంతోనే తనకూ అక్రెడిటేషన్ వచ్చింది! ఆ సందర్భంలో చాలా మంది నమ్మారు మీరు జర్నలిస్టు లోకాన్ని నిష్పక్షపాతంగా, తటస్థంగా కంపల్సరీ ఆదరిస్తారనీ! సింపతీ, గౌరవం చూపుతారనీ. జీవో 239/2016స్థానే మీ సర్కారు జీవో 252/2025 జారీ చేయడం మీకు తెలిసే జరిగి ఉంటుంది! దరిమిలా



రేందుకు బీదలకు రేషన్ కార్డు ఎలాగో మాకు అక్రెడిటేషన్ అలా ప్రామాణికమనీ, వార్తా సేకరణకూ సాధికారమనీ మీకు తెలియదని అనుకోలేం. మరోసారీ నేనే ముఖ్యమంత్రి, మాదే ప్రభుత్వం అంటూ చర్వితచరణంగా చెబుతోన్న మీరు పాత్రికేయుల అంశంలో మాత్రమే మరీ మరీ పొదుపుగా మెదలడంవల్ల సర్కారు గల్లాపెట్టేమీ పొంగిపొర్లదు. సకల ఆర్థిక సవాళ్ళేమీ సత్వరమే తీరిపోవు. మీ విస్తారమైన సంక్షేమ రాజ్యంలో పాత్రికేయులకు చేసే సహాయం సంద్రంలో బిందువంతనూ కాదు. మహానుభావులు ఎవరైనా ఈ కోతల కథలో మిమ్ములను "డ్రైవ్" చేయకూడదని కోరుకోవడం నేరం కాకుంటే చాలు. నిజానికి అక్షరంపై మమకారం, నిబద్ధత, ఎడతెగని అనుబంధం, జీవిత కాలపు సోయి గల జర్నలిస్టులను కాపాడుకునే

రాజకీయంగా మీకు ఏమాత్రం వినసొంపు అవని ప్రముఖ పేరు స్వయానా జర్నలిస్టుల నోట దినాం ధ్వనిస్తోంది. ఆ పేరును కీర్తిస్తూ, 23 వేల మంది జర్నలిస్టులకు ఏకరూప అక్రెడిటేషన్లు, సంక్షేమం ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. మీరు అంతకంటే మెరుగ్గా చేస్తే, కలం కార్మికులపై 252 కలం "పోటు" కాకుండా ఉండగలదు.

ఎవరి లైన్ వారిది. మీరు మాత్రం వాస్తవిక లైన్ వీడకండి. ఎద్దు ఏడ్చిన ఎవుసం శోభిల్లదని ప్రతీతి.

జర్నలిస్టుల బాధ/దుఃఖం పాలక పక్షాలకు దాదాపు అంతే అవగలదనే భావన అధికార పీఠం మీద ఉండే ఏలికలు ఎలియాస్ పాలకులు ఉరఫ్ ప్రభువులూ, ప్రభుత్వాధిపతులకు అంగీకార యోగ్యమేనా?

(వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

చదువు లేని బాల్యం, ప్రమాదకర భవిష్యత్తు

మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

చదువు ప్రతి పిల్లవాడి మౌలిక హక్కు అయినప్పటికీ, నేటి సమాజంలో అనేక మంది విద్యార్థులు వివిధ కారణాలతో చదువును మధ్యలోనే వదిలేస్తున్నారు. పేదరికం, కుటుంబ ఆర్థిక ఒత్తిళ్లు, తల్లిదండ్రుల అవగాహన లోపం, అలాగే పాఠశాలల్లో సరైన మార్గనిర్దేశం లేకపోవడం వంటి అంశాలు పిల్లలను బడికి దూరం చేస్తున్నాయి. చదువు కన్నా కూలి పని అవసరం అన్న భావన చిన్న వయసులోనే వారి కలలను మట్టిలో కలిపేస్తోంది. చదువు మానేసిన విద్యార్థి కేవలం వ్యక్తిగత సమస్యగా మిగలడం లేదు. చదువుకు దూరమైన పిల్లలు ఖాళీగా ఉండటం వల్ల తప్పుదారి పట్టే ప్రమాదం ఎక్కువగా కనిపిస్తోంది. కొందరు చిన్న వయసులోనే సిగరెట్, గుట్కా, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

ముంచుకొస్తున్న నష్టాలు

సరైన దారి చూపే వారు లేకపోవడం, పర్యవేక్షణ లోపం ఈ పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. ఇలాంటి పరిస్థితులు కుటుంబ భవిష్యత్తుపై మాత్రమే కాకుండా సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.బాల కార్మిక వ్యవస్థ పెరగడం, యువతలో నిరుద్యోగం అధికమవడం, మత్తు పదార్థాల దుర్వినియోగం పెరగడం, కొందరు నేరాల వైపు మళ్లే ప్రమాదం ఇవన్నీ డ్రాపౌట్ సమస్యకు ప్రత్యక్ష ఫలితాలే. ఒక పిల్లవాడి చదువు ఆగిపోతే, సమాజం ఒక బాధ్యతగల పౌరుడిని మాత్రమే కాదు, ఒక ఆరోగ్యవంతమైన యువతను కూడా కోల్పోతుంది.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఉన్నప్పటికీ, అవి లబ్ధిదారుల వరకు పూర్తిస్థాయిలో చేరడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వారి మానసిక పరిస్థితిని గమనించి మెలగాలి

విద్యార్థిని కేవలం మార్కుల ఆధారంగా కాకుండా, మానసికంగా కూడా అర్థం చేసుకునే విధానం విద్యా వ్యవస్థలో బలపడాల్సిన అవసరం ఉంది. చదువు మానేసిన పిల్లలు మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలంటే పాఠశాలలు, స్థానిక సంస్థలు, తల్లిదండ్రులు కలిసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.డ్రాపౌట్ విద్యార్థుల సంఖ్య తగ్గాలంటే ఇది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా, సమాజం మొత్తానికి సంబంధించిన అంశంగా



మారాలి. చదువు మానేసిన ప్రతి పిల్లవాడిని తిరిగి బడిలోకి తీసుకురావడమే కాకుండా, వారికి సరైన మార్గనిర్దేశం, కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు అందించాలి. ఎందుకంటే చదువుతోనే వ్యక్తి ఎదుగుతాడు, ఆరోగ్యంగా ఉంటాడు, సమాజం మారుతుంది, దేశం ముందుకు సాగుతుంది.

(వ్యాసకర్త జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

క్రీడలు ఆరోగ్యానికి దోహదపడుతాయి

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 27: క్రీడలు మానసిక ఉల్లాసంతో ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న 12వ రాష్ట్రస్థాయి మాస్టర్ అత్లెటిక్స్ పోటీలలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాబోయే ఒలంపిక్ పోటీలో భారత్‌కు పతకాలు రావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆరోగ్యం కోసం మరిన్ని ట్రాక్స్, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో , ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర రాజశేఖర్ లతో, మాస్టర్ అత్లెటిక్స్ పోటీల రాష్ట్ర అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ప్రభు కుమార్, లక్ష్మణ్‌రావు, చాట్ల శ్రీదర్, నల్లెల లక్ష్మణ్, కుడాల శిరీష్ లతో పాటు యంగ్ ఇండియా స్పోర్ట్స్ నిర్వాహకులు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామీణ అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

గ్రామీణ అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డిసిసి ప్రెసిడెంట్ ,శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, మాజీ ఎమెల్సీ జీవన్‌రెడ్డిలతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఆయా గ్రామ సర్పంచులు కృషి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

సహకార సంఘాల్లో 'కొండూరి' ఎనలేని కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, డిసెంబర్ 27: కరీంనగర్ డిసిసిబి చైర్మన్ గా 20 ఏళ్లుగా సేవలు అందించిన కొండూరు రవీందర్ వీడ్కోలు, సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సహకార సంఘాల్లో కొండూరీ రవీందర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సహకార సంఘాల్లో ఉన్నపుడే నేను మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన సహకార సంఘాల్లో ఉండేదని గుర్తు చేశారు. రైతులకు సహకార సంఘాల ద్వారా వారికి నిరంతరం అండగా ఉండేదన్నారు.

నేరాల నియంత్రణలో గణనీయమైన పురోగతి

- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 27: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరంలో నేరాల నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధించామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఐపీఎస్ తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వార్షిక నేర సమీక్ష నివేదికను విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే మొత్తం నేరాల్లో 16.84 శాతం తగ్గుదల నమోదైందని సీపీ వెల్లడించారు. ఘోర నేరాలు 9.09 శాతం, మహిళలపై నేరాలు 5.18 శాతం తగ్గాయని తెలిపారు. ఆస్తి నేరాల్లో రూ.2.04 కోట్ల విలువైన సొత్తును రికవరీ చేసినట్లు చెప్పారు. సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకొని రూ.1.10 కోట్లను బాధితులకు తిరిగి ఇప్పించామని, సీఐఈఆర్ పోర్టల్ ద్వారా 500కు పైగా మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసి అందజేశామని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రత కోసం షీ టీమ్స్, భరోసా కేంద్రాలు సమర్థంగా పనిచేశాయని పేర్కొన్నారు. 2025లో జరిగిన ఎన్నికలు, అన్ని మతపండుగలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించామని సీపీ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా లక్షల సంఖ్యలో ఈచలాన్లు జారీ చేసి, రోడ్డు ప్రమాదాల్లో స్వల్ప తగ్గుదల సాధించామని చెప్పారు. ప్రజా స్నేహిత పోలీసింగ్, ఆధునిక సాంకేతికతతో కరీంనగర్‌ను మరింత సురక్షిత నగరంగా అభివృద్ధి చేస్తామని సీపీ గౌస్ ఆలం స్పష్టం చేశారు.

ఎన్పీడీసీఎల్‌కు స్టేట్ అవార్డు

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 27: నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సేఫ్టీ అవార్డ్స్ 2024 సంవత్సరానికి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డ్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ కు దక్కిందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. వినియోగదారులకు అందించే సేవల పరంగా, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, ప్రమాదాలను తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలకు భద్రతా ప్రమాణాల పెంపు , ఉద్యోగులకు అందించే శిక్షణలో గాను ఉత్తమ పనితీరును కనబరిచినదుకు ఈ అవార్డు వరించిందని తెలిపారు . ఈ నెల 23 న ముంబయి లో జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో సి. ఈ (ఐటి , ప్లానింగ్) ఎన్ శ్రవణ్ కుమార్ , వరంగల్ డి ఈ టెక్నికల్(సేఫ్టీ ఆఫీసర్) వై . రాంబాబు అందుకున్నారు . ఈ సందర్భంగా శనివారం ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డ్ ను అందచేశారు.

హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి కి అంబులెన్స్

- పత్రాలు అందించిన కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 27: కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సొంత నిధులతో హుజురాబాద్ జనరల్ హాస్పిటల్‌కి అందజేసిన అంబులెన్స్ కు సంబంధించిన పత్రాలను శనివారం కరీంనగర్ పార్లమెంటు బీజేపీ వెహికల్ ఇంచార్జి సాంబయిపల్లి శ్రీనివాస్ రెడ్డి ద్వారా ఆస్పత్రి వైద్య అధికారి నల్ల నారాయణరెడ్డికి అందజేశారు. ఈ అంబులెన్స్ ద్వారా హుజురాబాద్ నియోజకవర్గంలోని రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించడం సులభమవుతుందని ఆస్పత్రి అధికారులు తెలిపారు. హుజురాబాద్ ఆస్పత్రి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని, కరోనా సమయం నుంచి నేటి వరకు ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలను కేంద్ర మంత్రి సమకూర్చారాని ఆస్పత్రి వైద్యులు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఆగివున్న టిప్పర్ ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు గాయాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 27 : మెదక్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కంది దగ్గర ముంబై జాతీయ రహదారిపై రోడ్డుపక్కన ఆగి ఉన్న టిప్పర్ లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. బస్సులో దాదాపు 60 మంది ప్రయాణికులు ఉండగా, 15 మందికి స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో పెద్ద ప్రాణనష్టం తప్పింది ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని, బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపాడని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.ఇదే బస్సు ప్రమాదానికి అరగంట ముందు శివంపేట దగ్గర ఒక స్కూటీని కూడా ఢీకొట్టిందని, అయినా వేగం తగ్గించలేదని ప్రయాణికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన ప్రయాణికులను ఆసుపత్రులకు తరలించారు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులివ్వాలి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 27 : తమకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డెస్క్ జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. శనివారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద డీజేఎఫ్ టీ (ఉమ్మడి నిజామాబాద్ జిల్లా) శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డెస్క్ జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. ఇందుకోసమే జీవో 252ను తీసుకువచ్చిందని ఆరోపించారు. అక్రెడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరుతో జర్నలిస్టులను విడదీయాలని కుట్ర పన్నిందని మండిపడ్డారు. తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి మరీ రాత్రి సమయాల్లో పనిచేస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులు, డెస్క్ జర్నలిస్టులు కలిసి పనిచేస్తేనే జర్నలిజం అవుతుందన్నారు. కానీ సర్కారు మాత్రం వివక్ష చూపిస్తోందని, ఇది సరైనది కాదని పేర్కొన్నారు. జీవో 252ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. డెస్క్ జర్నలిస్టులు చేపట్టిన నిరసనకు టీడబ్ల్యూజేఎఫ్ సంపూర్ణ మద్దతు తెలిపింది. ప్రభుత్వం జీవో 252 విడుదల చేసిన నాటి నుంచి ఫెడరేషన్ వ్యతిరేకిస్తూ వస్తోందని యూనియన్ నాయకుడు రాంచందర్ తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఐ అండ్ పీఆర్ ఉన్నతాధికారులను కలిసి విన్నవించామని పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జమాల్‌పూర్ గణేశ్, రామకృష్ణ, సుభాష్, పంచరెడ్డి శ్రీకాంత్, భూపతి, సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 27: మంచిర్యాల నియోజకవర్గంలో మున్సిపల్ పరిధిలోగల తిలక్ నగర్ కు చెందిన మాజీ కౌన్సిలర్ మజీద్ బి ఆర్ ఎస్ యువ నాయకులు రేగుంట వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 150 మంది కార్యకర్తలు బి ఆర్ ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బి ఆర్ ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోనికి చేరినట్లుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా వారిని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆయన సతీమణి మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మునుముందు మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందు ఉండే విధంగా చేస్తామన్నారు. ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ కార్యదర్శి పూదరి తిరుపతి మాజీ కౌన్సిలర్స్ మహిళలు యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,డిసెంబర్ 27: రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం మెదక్ జిల్లాలో ఏడుపాయల దుర్గాభవాని మాతను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆయనకు ఆలయ అధికారులు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.శ్రీవనదుర్గా భవాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బక్కి.వెంకటయ్యను శాలువతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నూతన సంవత్సరంలో మరింత ఆనందంగా ఉత్సాహంగా ఉంటూ ప్రజల కోరికలు నెరవేరాలని దుర్గామాతకు మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. వీరి వెంట నర్సాపూర్ ఆర్డిఓ మైపాల్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ సతీష్,ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాహిబ్జాదాల వీరత్వం ప్రతి భారతీయుడికి స్ఫూర్తి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 27 : సాహిబ్జాదాల వీరత్వం ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. శనివారం గాజుల్ పేట్ గురుద్వార్‌లో నిర్వహించిన వీర బాల్ దివస్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సిక్కు చరిత్రలో వీర బాల్ దివస్‌కు ఉన్న గొప్ప ప్రాముఖ్యతను తెలిపారు. చిన్న వయసులోనే ధర్మ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి త్యాగాలు దేశభక్తి, ధైర్యసాహసాలకు చిరస్మరణీయ ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగొల్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ ప్రభాకర్, మండల ప్రెసిడెంట్ బాబీ సింగ్, మఠం. పవన్, ముండాడ. పవన్, మరావర్ కృష్ణ గురుద్వార్ నిర్వాహకులు, సిక్కు సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులలో సామాజిక సేవ పెంపొందించుకోవాలి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం అక్బర్ పెట- భూంపల్లి డిసెంబర్ 27: జాతీయ సేవా పథకం(ఎన్. ఎస్. ఎస్.) విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.భూంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులచే జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని చైర్మన్ వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించే,స్వచ్ఛంద సమాజ సేవా కార్యక్రమం వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుంది అన్నారు. విద్యార్థులు గ్రామాలు, మురికివాడలను దత్తత తీసుకొని,అక్కడి అవసరాలకు అనుగుణంగా పరిశుభ్రత,విద్య,ఆరోగ్య పై అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వాడకం వచ్చే హానికరాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం చైర్మన్ వెంకటయ్య ను, సర్పంచ్,ఉపసర్పంచ్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దోమకొండ అంజయ్య, సర్పంచ్ జన్నారెడ్డి,ఉపసర్పంచ్ అనూష నందం, వార్డు సభ్యులు,తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సత్యవతి,కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపిక బృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఏటీఏంలలో రూ.30 లక్షలు చోరీ

- ఏటీఏంలను పరిశీలించిన ఇన్చార్జి సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలో రెండు ఏటీఎంలో చోరీలు జరిగాయి. దుండగులు రెండు ఏటీఎంలను పగలగొట్టి రూ.30 లక్షలు వరకు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎంలను కామారెడ్డి ఎస్పి నిజామాబాద్ ఇన్చార్జ్ సిపి రాజేష్ చంద్ర శనివారం పరిశీలించారు. శనివారం తెల్లవారుజామున నిజామాబాదు నగరంలో టౌన్ 4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగ్ర బ్రాంచ్ కు సంబంధించిన డెవలప్మెంట్ క్రెడిట్ బ్యాంక్ ఏటిఎమ్, టౌన్ 5 పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద గల ఎస్బీఐ బ్యాంక్ ఏటిఎమ్ లను గుర్తుతెలియని దొంగలు దాడి చేసి అందులో గల నగదును దాదాపు రూ.30 లక్షల వరకు దోచుకుని వెళ్ళారూ. నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ ఎం. రాజేష్ చంద్ర సంఘటన స్థలాన్ని పర్యవేక్షించి నిందితుల గుర్తింపు, పట్టుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని దర్యాప్తు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యలతో నగరంలో భద్రత మరింత బలోపేతం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తునదని ఇన్చార్జి సీపీ తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, నిజామాబాదు ఏసిపి రాజా వెంకటరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, 4 టౌన్ ఎస్హెచ్ఓ సతీష్ కుమార్ , టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, 4 టౌన్ ఎస్ఐ గంగాధర్, బ్యాంక్ మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

జనవరి 5 నుంచి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం బచావో కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం. పలు ప్రయోజనాలతో తీసుకొచ్చిన పథకాన్ని రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించాం. మహాత్ముడి పేరుతో తీసుకువచ్చిన ఈ పథకాన్ని కాపాడుకోవాలని నిర్ణయించాం. దీని కోసం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టనున్నాం.

- సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం రేవంత్

జీవో 252 వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల ఆందోళన

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 27: జర్నలిస్టుల హక్కుల ను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 ను వెంటనే సవరించాలని సిద్దిపేట జిల్లా టియుడబ్ల్యూజే H 143 జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అక్రిడేషన్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని మానుకోవాలని సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా టియుడబ్ల్యూజే నాయకులు గందె నాగరాజు, నిమ్మ అశోక్ గజ్వేల్ ఇంచార్జ్ నవీన్, హుస్నాబాద్ నాయకులు కళాచందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 23వేల అక్రెడిటేషన్ కార్డులివ్వగా, కొత్త జీవోతో అవి 10 వేలకు పైగా కార్డులకు కోత పడే ప్రమాదం ఉందని జర్నలిస్ట్ లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఒక కార్డు ఉండేదని.. ఇప్పుడు అది రద్దు చేసి, స్టేట్, జిల్లా, మండలస్థాయిలో మాత్రమే కార్డులివ్వాలని నిర్వహించచడం దారుణమన్నారు. గతంలో జనరల్, స్పోర్ట్స్, కల్చరల్, ఫిల్మ్, కార్టూనిస్టులకు ప్రత్యేక కోటా ఉండేదని, ఇప్పుడీ కోటాను రద్దుచేసి, ఫ్రీలాన్స్ కోటాలో.. అదీ కార్టూనిస్టులకే పరిమితం చేశారని, దీనిపైప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కు డిగ్రీ విద్యార్హత లేదా ఐదేండ్ల అనుభవం ఉండాలని, జిల్లా, మండలస్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి చేశారని, కానీ వీరి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. ఇది వరకు పట్టణ ప్రాంతాలు, మండలాల్లో 50వేల జనాభాకు ఒక అక్రెడిటేషన్ కార్డు చొప్పున ఇచ్చేవారు. కానీ ఇప్పుడు మండలానికి ఒక కార్డు మాత్రమే ఇస్తారని ఆ జీవోలో పేర్కొనటం సరికాదని అన్నారు. కేబుల్ చానళ్లకు జిల్లా స్థాయిలో ఇచ్చే కార్డులను రద్దు చేశారు. ఇది వరకు జిల్లా స్థాయిలో కార్డులు ఇచ్చేవారని, ఈ కార్డులతో ఎలాంటి ప్రత్యేక హోదా ఉండదని, కేవలం జర్నలిజం కోసం మాత్రమే వాడాలని, విజిటింగ్ కార్డులు, లెటర్ హెడ్స్ పై' అక్రెడిటేటెడ్ టు ది గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ' అన్న పదాలు వాడరాదని, ముద్రించరాదని పేర్కొనటం సరికాదని వారన్నారు. ఈ జీవో ద్వారా చిన్న పత్రికలను చిదిమేస్తుందని, మూలిగే నక్క మీద తాటి కాయ అన్న చందంగా చిన్న పత్రికలపై కక్షసాధింపు ధోరణిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో కఠినమైన నిబంధనలతో అక్రెడిటేషన్ రూల్స్ ఫ్రేం చేశారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి, ఈ జీవోను సవరిచాంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కట్ట నవీన్ సంపత్ పోతుల మల్లేష్ కర్ణాకర్ శ్రీనివాస్ సంపత్ తదితర సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం

- మిట్టపల్లి అంగన్వాడి కేంద్రంలో ఈసీసిఈ డే

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబరు 27: అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని తల్లిదండ్రులు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించి పాఠశాల వాతావరణాన్ని అలవాటు చేయాలని మిట్టపల్లి సర్పంచ్ చింతల శ్రీనివాస్ అన్నారు. సిద్ది పేట అర్బన్ మండలం మిట్టపల్లి అంగన్వాడి కేంద్రం 2 లో శనివారం ఈ సి సి ఈ (పూర్వ బాల్య ఆరంభ సంరక్షణ విద్య) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ విద్యార్థులకు ఆట వస్తువులను చాట్ తో తయారుచేసిన అక్షరాలను చూపించి ఆటలు ఆడిపించారు. గర్భవతులు బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిల్లల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాణి కిషన్, ఏఎన్ఎం విజయ, అంగన్వాడీ టీచర్ పద్మ, వార్డు సభ్యులు మల్లేశం, పరశురాములు, మూర్తి, రాజు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

స్నేహితుడి జన్మదినాన అన్నదానం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 27: స్నేహితుడి జన్మదిన అంటే అర్ధరాత్రి వరకు మద్యం తాగి జన్మదిన కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపే స్నేహితులు ఉన్న ఈ కాలం లో హైదరాబాద్ లో నివాసముంటున్న చిన్ననాటి స్నేహితుడు చెక్కల విజయ్ కుమార్ అనే స్నేహితుడి జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సుమారు 200 మంది అనాధలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 బిర్యానీ ప్యాకెట్లను తీసుకుని మెదక్ జిల్లా కేంద్రంలో అనాథలకు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్. సంధ్య నిలయంలో పంచి పెట్టారు. స్వామి, లాజర్, రాజేంద్ర, అనోక, శ్రీను స్నేహితులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బులు వృథాగా ఖర్చు చేసే బదులు పదిమందికి ఉపయోగపడేలా ఖర్చు పెడితే బాగుంటుందనే ఆలోచనతో అనాధలకు, పేద ప్రజలకు బిరియాని పంపిణీ చేశామని వారు తెలిపారు.

మండల సర్పంచ్ల ఫోరం
అధ్యక్షులుగా గంగసాని రాజిరెడ్డి

ప్రతిపక్షం,తొగుట, డిసెంబరు 27: మండల సర్పంచ్ల ఫోరంను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. అధ్యక్షులుగా ఘనపూర్ సర్పంచ్ గంగసాని రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గుడికందులలో శుక్రవారం రాత్రి సర్పంచ్ కన్నయ్యగారి లక్ష్మి నివాసంలో మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కె హరికృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు దోమల కొమురయ్య, బక్క కనకయ్య, మాజీ రైతు బంధు మండల అధ్యక్షులు బోధనం కనకయ్య లతో కలిసి సర్పంచ్ లు సమావేశం నిర్వహించి ఫోరంను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కోల వెంకటస్వామిగౌడ్ (బండారుపల్లి), ఉపాధ్యక్షులుగా నంట సమీర పరమేశ్వర్ రెడ్డి, (గోవర్ధనగిరి), ప్రధాన కార్యదర్శిగా బండారు కవిత స్వామిగౌడ్ (వెంకట్రావుపేట), కోశాధికారిగా చంద లావణ్య స్వామి (చందాపూర్), కార్యవర్గ సభ్యులుగా బక్క కనకయ్య (జప్తి లింగారెడ్డి పల్లి), కే లక్ష్మి (గుడికందుల), పన్యాల ప్రవీణ్ రెడ్డి (పెద్దమాసాన్ పల్లి), పిట్ల నర్సింలు (ఎల్ బంజేరుపల్లి), ఎర్వ గోపాల్ రెడ్డి (వర్ధరాజ్ పల్లి) లను ఎన్నుకున్నారు. తనపై ఎంతో విశ్వాసంతో ఫోరం అధ్యక్షులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కి సర్పంచ్ లకు గంగసాని రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ల సమస్యలపై పోరాటం సాగిస్తామని వారికి అండగా ఉంటామని ఆయన తెలిపారు.

విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 27: విద్యార్థులు,యువత భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణపై మెదక్ జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు,మానసిక వైద్య నిపుణులతోకలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల ఉత్పత్తి,రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలు,గంజాయి ఇతరత్రా మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం,క్లబ్ ఏర్పాట్లు ఇతర వివిధ రకాల పద్ధతుల ద్వారా అవగాహన కల్పించాలని,మానసిక వైద్య నిపుణులచే శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు వివరించాలని, మాదకద్రవ్యాల నియంత్రణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని,విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డ్రగ్స్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని,ఇన్ పేషెంట్ సేవలకు కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మందుల దుకాణాలు, ఆసుపత్రులలో అందించే గుర్తించిన ప్రత్యేకమైన డ్రగ్స్ పై రిజిస్టర్ నిర్వహించాలని,వైద్యుల సూచన మేరకు మాత్రమే మందులు విక్రయించాలని, మత్తు మందుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెడికల్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐ.టి.ఐ., జూనియర్, డిగ్రీ కళాశాలలలో మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థినీ, విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించాలని,గురుకులాలు, వసతిగృహాలు, అన్ని విద్యా సంస్థలలో ప్రహరీ, కారిడార్లు, పరిసరాలు స్పష్టంగా కనిపించే విధంగా సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బెల్ట్ షాపులు, గుడుంబా స్థావరాలపై పోలీసులు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అకస్మాత్తుగా కార్డన్ సెర్చ్ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ మాదకద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, డిసెంబర్ 27: చేగుంట మండలం రాంపూర్ గ్రామ సర్పంచ్ కాశ బోయిన నాగమణి సుదర్శన్ ను ముదిరాజ్ సంఘం జిల్లా నేతలు సన్మానించారు. ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్ సమక్షంలో సన్మానం చేశారు. మెజార్టీ ఓట్లు సాధించిన కారణంగా సన్మానిస్తూ అభినందించారు. అలాగే చిటోజిపల్లి సర్పంచ్ మద్ది లక్ష్మీనరసయ్యను సన్మానించినట్లు తలారి బిక్షపతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు అశోక్ మైనార్టీ నాయకులు యూసుఫ్, గౌరీ, బాబా మోయిస్ పాల్గొన్నారు.

లక్ష్యం కోసం ఆత్మ విశ్వాసంతో కష్టపడాలి

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 27: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందే ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో అందే గ్రామాభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రేరణ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కవి రచయిత భగవాన్ రెడ్డి , ఫారెస్ట్ ఆఫీసర్ మల్లేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడు తూ విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఏ రంగంలోకి వెళ్లాలన్న స్పష్టత విద్యార్థులకు ఉండాలని చెప్పారు. ఏ కోర్సు చదవాలో నిర్ణ యం తీసుకుని ఆ అంశానికి సంబంధించిన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించా రు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, అందుకు ప్రణాళికాబద్ధంగా చది వి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మంచిగా చదువుకొని, ఉన్నత ఉద్యోగంలో స్థిర పడాలని, అన్నారు.మనలో ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం ఉంది. మండల విద్యాధికారి ప్రవీన్ బాబు .ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, రవీందర్ రెడ్డి, సర్పంచ్ యాదగిరి , ఉప సర్పంచ్ పర్శరాములు, సభ్యులు, ప్రవీణ్, అఖిల్ ,పోచయ్య, అందే ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో గురుకుల విద్యార్థి ప్రతిభ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 27: మెదక్ జిల్లాలో హవెలిఘనపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే బీసీ గురుకుల పాఠశాల 6 వ తరగతి చదువుతున్న ఎ.యస్ విరంచి ఉపన్యాసం జూనియర్ విభాగంలో రాష్ట స్థాయి మొదటి బహుమతిని గెలుపొందాడని ప్రిన్సిపల్ సృజన శనివారం ఒక ప్రకటలో తెలిపారు. బీసీ గురుకుల విద్యార్థులకు ఇటీవల లీటరరీ అండ్ కల్చరల్ కార్నివాల్ నిర్వహించారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో మొదటి బహుమతి గెలిచి రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్ని వాల్ లోనూ మొదటి బహుమతి కైవసం చేసుకొని స్కూల్ పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాడని పేర్కొన్నారు. ఫ్యాన్సీ డ్రెస్, భరత నాట్యం, క్విజ్, ఆర్ట్ క్రాఫ్ట్, డిబేట్ వంటి వాటిలో తమ పాఠశాల నుండి మరో 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి కార్నివాల్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సృజన, ఉపాధ్యాయులు అభినందించారు.

కన్నుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ

- పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 27: మెదక్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో శనివారం మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వైద్య. రాజు పంతులు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృతలతో అభిషేకం నిర్వహించారు.స్వామియే శరణం అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామ స్మరణంతో దేవాలయం మారుమోగింది. ఈ మహా పడిపూజ మహోత్సవానికి పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలు ఆలపించారు.పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలుయం. పద్మదేవేందర్ రెడ్డి హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ...అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రజలపై అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు ఉండాలన్నారు. స్వామివారి చల్లని చూపు మెదక్ జిల్లా ప్రజలపై ఉండాలని కోరారు. అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, న్యాయవాది జీవన్ రావు,మాజీ కౌన్సిలర్లు జయరాజ్, మాయ మల్లేశం, నాయకులు లింగా రెడ్డి,నగేష్,మెడిశెట్టి. శంకర్,రుక్మాచారి,అయ్యప్ప స్వాములు, అయ్యప్ప మాల దారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జర్నలిస్టు అక్రెడిటేషన్ల కొత్త జీవోను సవరించాలి

- అర్హులైన జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- టియూడబ్ల్యూజే (హెచ్ 143) డిమాండ్
- జిల్లా కలెక్టరేట్ల ముందు ఆందోళన... డీఆర్ఓ కు వినతిపత్రం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 27 : రెండు సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ నెంబర్ 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీ యూడబ్ల్యూజే (హెచ్ 143)ఉమ్మడి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్, జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి లు విమర్శించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జర్నలిస్టులు మెదక్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి డిఆర్ఓ భుజంగ రావు కు వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు తెచ్చే విధంగా కొత్త జీ.ఓ ఉందని వారు అభిప్రాయ పడ్డారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో పనిచేసిన జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 2014 మార్చి నెలలో జరిగిన జర్నలిస్టు జాతరకు వచ్చిన అప్పటి కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చుకుందామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఆయన సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రెడిటే షన్స్ కార్డ్స్ జారీ చేయడం జరిగిందని వారు అన్నారు. ఇప్పుడు కొత్త జీవో ద్వారా మీడియా అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరిట రెండు కార్డులు తెచ్చి గందరగోళం సృష్టించారని, ఏ కార్డు వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో జీవోలో విశదీకరించలేదని, జర్నలిస్టులనే వాళ్లకు అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు ఉండాలని డిమాండ్ చేశారు. మండల స్థాయిలో లక్ష జనాభా పైన ఉంటే గతంలో అదనంగా కార్డులు ఇచ్చేవారని, ప్రస్తుతం కేవలం మండలానికి ఒక కార్డు, నియోజకవర్గానికి అసలు కార్డులే లేకుండా ఎత్తివేయడం వల్ల పార్ట్ టైం రిపోర్టర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మెజార్టీ జర్నలిస్టులు వ్యతిరేకించే ఈ జీవో ను వెంటనే పునః పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ లు అందేలా నూతన జీఓను సవరించాలని డిమాండ్ చేశారు. ఇండిపెండెంట్ జర్నలిస్టుల కనీస అనుభవం 10 సంవత్సరాలనుండి 15 సంవత్సరాల పెంచడం అన్యాయం అన్నారు. పెద్ద పేపర్లకు, శాటిలైట్ ఛానల్ లకు సైతం భారీ స్థాయిలో కోత విధించారని అన్నారు. జీ.ఓ 252 ను సవరించాలని తాము కోరుకుంటున్నామని, ఒకవేళ తాత్సారం చేస్తేరాజ్యాంగం కల్పించిన హక్కుగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లోటియుడబ్ల్యూజే (హెచ్ 143)సీనియర్ నాయకులు గోపాల్ గౌడ్, సంగమేశ్వర్,గోవర్ధన్ రెడ్డి, రహమద్,రాఘవులు, యాదగిరి, కార్తీక్,సోని రాజు, గిరి, శ్రీనివాస్, ఉషయ్య,శేఖర్ గౌడ్, హమీద్,ఆంజనేయులు, రవి,యాదగిరి,వంశీ,సంగమేశ్వర్,చంద్ర శేఖర్, అరవింద్,జయరాజ్ ,యూసుఫ్, ఇంతియాజ్ అబ్రహం,రాణి,కే. వేణుగోపాల్, జి. భాస్కర్ గౌడ్, చెంది శ్రీనివాస్, పెద్దిగారి నగేష్ గుప్త, టి. నాగరాజు,మచ్చయాదగిరి, డి.నవీన్,శ్రీకాంత్, రఘు, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1 వరకు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ కొనసాగుతుంది. మద్యం తాగి పట్టుబడితే జైల్లో వేయటం ఖాయం. హైదరాబాద్ మొత్తం ఇప్పటికే న్యూ ఇయర్ డ్రంకెన్ డ్రైవ్ నడుస్తోంది. ఈ ఏడాది నగరంలో నేరాలు 15% తగ్గాయి. పోక్సో కేసులు కూడా తగ్గుముఖం పట్టాయి. 368 కేసుల్లో రూ.6.45 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశాం.

- హైదరాబాద్ సీపీ సజ్జనార్

ఉపాధి పథకం రద్దు.. పేదల హక్కుపై జరిగిన దాడి

- కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించిన రాహుల్‌గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 27: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, కొత్త చట్టాన్ని తీసుకురావడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తాంధీ తీవ్రంగా విమర్శించారు. ఇది పేద ప్రజల హక్కుపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లడుతూ ఉపాధి పథకం కేవలం ఒక పథకం మాత్రమే కాదని, అది పేదల పని హక్కు అని పేర్కొన్నారు. మంత్రులను సంప్రదించకుండా ప్రధాని నరేంద్ర మోడీ సొంతంగానే ఈ నిర్ణయం తీసకున్నారన్నారు. మోడీ ఏది కోరుకుంటే దేశంలో అదే అమలు అవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు రావాలని విపక్ష నేతలకు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన ఈ పథకాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు గ్రామీణ ప్రజలకు ఉపాధి లేకుండా చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలకు ఎన్నోయేండ్లుగా ఆర్థిక భరోసా కల్పిస్తూ అన్నం పెడుతున్న పథకాన్ని ఆపితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. దేశంలోని వ్యవస్థలపై కేంద్రం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై ప్రజల తరఫున కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ పథకం రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి 'ఎంజీ నరేగా బచావో అభియాన్' పేరుతో దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని రాహుల్‌గాంధీ ప్రకటించారు.

విశ్వ వీక్షణం

200 ఇండ్లను కూల్చిన అధికారులు

- నిరాశ్రయులైన 400 ముస్లిం కుటుంబాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, డిసెంబర్ 27: కర్ణాటకలో 200కుపైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. దీంతో సుమారు 400 ముస్లిం కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల బుల్డోజర్ చర్యను ఇక్కడ అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. డిసెంబర్ 22న తెల్లవారుజామున 4 గంటల సమయంలో బెంగళూరు శివారు కోగిలు గ్రామంలోని ఫకీర్ కాలనీ, వాసిం లేఅవుట్‌లోని సుమారు 200కు పైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో నాలుగు జేసీబీలు వినియోగించారు. 150 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఉర్దూ ప్రభుత్వ స్కూల్‌కు ఆనుకుని ఉన్న సరస్సు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. కాగా, వందల సంఖ్యలో ఇళ్లను కూల్చివేయడంతో సుమారు 400కు పైగా కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వీరిలో ఎక్కువగా ముస్లిం కుటుంబాలే ఉన్నాయి. తమకు ముందస్తు నోటీసు అందలేదని, పోలీసులు బలవంతంగా తమను ఖాళీ చేయించి ఇళ్లను కూల్చివేశారని నివాసితులు ఆరోపించారు. తీవ్ర చలికాలంలో వృద్ధులు, పిల్లలతో పాటు వందలాది మంది తాత్కాలిక గుడారాల కింద తలదాచుకుంటున్నట్లు వాపోయారు. మరోవైపు ఇళ్ల కూల్చివేతల నేపథ్యంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అమలు చేస్తున్న బుల్డోజర్ రాజ్యాన్ని ఇక్కడ అమలు చేస్తున్నారని వామపక్ష పార్టీలు మండిపడ్డాయి. కేరళ సీఎం పినరయి విజయన్ దీనిపై సీరియస్‌గా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ 'మైనారిటీ వ్యతిరేక' రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆయన విమర్శించారు.



వ్యక్తిత్వమే అసలైన అందం!

"అందమె ఆనందం
ఆనందమె జీవిత మకరందం"

అన్న అలనాటి సినీకవి సముద్రాల మాటలు అక్షరాల నిజం చేస్తోందీ మానవ ప్రపంచం. ఆ మకరందం గుబాళింపు గొప్ప గొప్ప రుషుల్లో కూడా నాడు గుబులు పుట్టించింది. ఆలోచనలు మనసును చేరకుండా ఇనుప కచ్చడాలను బిగించుకుని కఠోర తపస్సుచేస్తున్న విశ్వామిత్రుడు మేనక అందానికి ఐసయిపోయి ఆధ్యాత్మిక వికాసానికి ఆనకట్ట వేసుకున్నాడు. చింతామణి కోసం అత్తగారిచ్చిన అంటు మామిడి తోటలను సైతం అమ్మివేసి నీళ్ళబిందెలు మోసిన భవానీ శంకరం, చావుబతుకుల్లో ఉన్న భార్యను సైతం విడిచి వచ్చి కళ్ళు పొడుచుకొన్న బిల్వమంగళుడు, లక్షల విలువజేసే వ్యాపారం కోల్పోయి అట్ల పళ్ళెం చేత బట్టిన సుబ్బిశెట్టి వంటివారు పాతకాలం ఉదాహరణలు. ఇక ఈనాటి మనుషుల గురించి అయితే చెప్పనే అక్కరలేదు.. దొరికితే దొంగ దొరక్కపోతే దొర అన్నట్లు దొంగచాటుగా శృంగారాస్వాదన చేస్తున్న స్వాములు లెక్కకు మించి.. చూస్తుంటే.. వీరంతా ఎప్పుడో పొందే స్వర్గానందం ఇప్పుడే ఇక్కడే పొందుదామని తొందరపడిపోతున్నట్లుంటుంది. కానీ, 'శరీరానందమే జీవిత మకరందం కాదు.. ఆత్మానందం పొందాలి.. ఈ మాటంటే..! వినేవారెవరు? అందాన్ని, ఆనందాన్ని తనివితీరా ఆస్వాదించి, చివరికి శరీర సౌందర్యం తాత్కాలికమని గ్రహించిన వాడు కాబట్టి వేమన 'తొమ్మిది కంతల తిత్తికి ఇమ్మగు సొమ్ములు ఏటికి చెపుమా?' అన్నారు. సత్కార్యాలు చేయటం ద్వారా ఆత్మ సౌందర్యం పెరుగుతుంది. శాశ్వతమయిన ఆనందం కలుగుతుంది. అన్ని విధాలా ఆనందానికి అర్హులవుతారు. నాటి తరం నుంచి నేటితరం వరకూ అందరూ అందానికి దాసులే.. అందం అయస్కాంతం లాంటిది. నేడు అందాల పోటీలు జరుగుతున్నాయంటే ప్రతి ఒక్కరూ టీవీలకు అతుక్కుపోతారు. అంటే దేశమంతటా సౌందర్య స్పృహ పెరిగింది. వయసుతో నిమిత్తం లేకుండా అందరూ అందాన్ని ఆపాదించుకోడానికి తాపత్రయపడుతున్నారు. అందానికి ఉన్న ఆకర్షణ అలాంటిది. అయితేశారీరక సౌందర్యం కాలంతోపాటు కరిగిపోతుంది. వ్యక్తిత్వ సౌందర్యమే కలకాలం నిలిచి ఉంటుంది.ఐశ్వర్యారాయ్, సుస్మితా సేన్, దియా మీర్జా, గద్దె సింధూర వీళ్లంతా భారతదేశపు అందాల రాణులు. సౌందర్యం వీరికి విశ్వఖ్యాతి అందించింది. అందం పట్ల మోజు పెరుగుతోన్న నేపథ్యంలో నగరాలు, పట్టణాలకే కాదు పల్లెలకూ బ్యూటీపార్లర్లు విస్తరించాయి. దేశంలో సౌందర్య సాధనాల అమ్మకాలు కోట్లకు పడగలెత్తుతున్నాయి. అందానికి ప్రాధాన్యం ఇవ్వడం ఈనాటిది కాదు. కావ్యాలు, ప్రబంధాల్లోనూ అందాల వర్ణనలు కోకొల్లలు. కాళిదాసు లాంటి కవులు తమ కథానాయకుల అంద చందాల గురించి చేసిన వర్ణనలు ఈనాటికీ అద్భుతమే.. కాలమేదైనా అందం అయస్కాంతం లాంటిది! ఆకర్షణశక్తిని పెంచుకోడానికి ఆసక్తి చూపడంలో తప్పులేదు. అయితే వ్యాపార ప్రకటనలను నమ్మి పెంచుకునే కృత్రిమ అందంతో ఎంతవరకూ సఫలీకృతులం అవుతాం అన్నదే ప్రశ్న. సహజ సౌందర్యానికి మెరుగులు దిద్దడం మరచి, కృత్రిమ అందాలకు తాపత్రయపడటం ఎండమావుల వెంట పరుగెత్తడం లాంటిదే.. సహజమైన జీవనశైలి, తగినంత వ్యాయామం, మంచి ఆహారం ద్వారా పొందే ఆరోగ్యం మన అందాన్ని, ఆకర్షణనూ పెంపొందిస్తుంది. అంతే తప్ప కృత్రిమ సౌందర్యం కలకాలం నిలవదు. అదే వ్యక్తిత్వ సౌందర్యం చిరస్థాయిగా నిలుస్తుంది.

అందం ఆకర్షిస్తుంది. ఆకర్షణ సమాజానికి ఆధారం. ఆకర్షణతోనే మనుషుల మధ్య సంబంధాలు ఏర్పడతాయి. పరస్పర ఆకర్షణ ద్వారా మాత్రమే వ్యక్తులు సమాజంలో సభ్యులుగా రాణించగలుగుతారు. ఎక్కువకాలం జీవించగలుగుతారు. అయితే, దీనికి శారీరక ఆకర్షణ ఒక్కటే సరిపోదు. గుణగణాలు, వ్యక్తిత్వం లాంటి మానసిక ఆకర్షణలు అవసరం. ఇద్దరు వ్యక్తుల మధ్య సాన్నిహిత్యానికి భౌతిక, మానసిక అంశాలు రెండూ ముఖ్యమే.. అయితే, ఇందులో శారీరక ఆకర్షణ తొలిమెట్టు మాత్రమే.. అది వయసుతోపాటు కరిగిపోతుంది. సాన్నిహిత్యం పెరిగేకొద్దీ మానవ సంబంధాల్లో వ్యక్తిత్వ అంశాలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇది వయసుతోపాటు పెరుగుతూ ఉంటుంది. జీవిత భాగస్వాములు సైతం ఒకరినొకరు వ్యక్తిత్వ లక్షణాలతోనే ఎక్కువ ఆకర్షణకు గురవుతారు. యువతీ యువకులు ఎక్కువగా శారీరక ఆకర్షణకు గురికావచ్చు కానీ, ఆ ఆకర్షణలోనూ వ్యక్తిత్వ లక్షణాలు, బుద్ధి, తెలివితేటలకు ప్రాధాన్యత ఉంటుంది. కాబట్టి పదుగురినీ ఆకట్టుకోవడానికి బ్యూటీపార్లర్ల చుట్టూ అదే పనిగా తిరగాల్సిన అవసరం లేదు. అంతకంటే ముందు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యమే ముఖ్యం. ఎదుటివారి ముందు ఎలాంటి దాపరికం లేకుండా మనం మన వ్యక్తిత్వ లక్షణాలను ప్రదర్శించాలి. అయిస్కాంతంలాంటి చిరునవ్వుతో ఎదుటివారిని ఆకర్షించాలి. అందంగా ఉండటమంటే డిజైనింగ్ దుస్తులు వాడమని కాదు, ఉన్న వాటిని శుభ్రంగా వాడుకుంటే చాలని.. ఎదుటివారికి అందంగా కనిపిస్తారు. కూర్చున్నా, నిల్చున్నా మనకంటూ ఒక స్టయిల్ ఉండాలి. మాట్లాడే వ్యక్తి కళ్లలోకి సూటిగా చూడటం అలవాటు చేసుకోవాలి. కళ్లతోనే ఆకర్షణ పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసం కలిగించే స్నేహాన్ని నలుగురికీ పంచాలి. ఎదుటివారు చెప్పేదాన్ని పూర్తిగా విని, తర్వాత మనోభావాలను వ్యక్తీకరించాలి.

ఒకరితో మాట్లాడుతున్నప్పుడు మరొకరిని పొగడకూడదు లేదా నిందించకూడదు. మాటల్లో వ్యక్తం కాని విషయాలను తెలిపే బాడీ లాంగ్వేజ్‌ని గమనించాలి. చిన్న, పెద్ద తేడాలు లేకుండా అందరి పట్లా గౌరవ మర్యాదలు ప్రదర్శించాలి. క్రమశిక్షణ అలవర్చుకోవాలి. మృదుభాషణతో ఎదుటివారి స్పందనను అంచనా వేయాలి. ఎదుటివారి స్పందనకు అనుగుణంగా మన మనసులోని భావాలను వెల్లడించాలి. అవతలివారు మనతో మాట్లాడటం ఓ ఆనందకరమైన విషయంగా పరిగణించేలా నడుచుకోవాలి. వ్యక్తిత్వ లక్షణాలు కలిగి ఉన్నంతలో శుభ్రంగా, పోషక విలువలతో మంచి ఆహారం తీసుకుంటూ, రోజూ వ్యాయామం, యోగా లాంటివి చేస్తూ ఆరోగ్యంగా ఉంటే చాలు. ఆనందంతోపాటు అందమూ మీ సొంతమవుతుంది. వ్యక్తిత్వమూ నిలుస్తుంది!

స్వచ్ఛమైన ఇంటి కోసం...

వాతావరణ కాలుష్యం రోడ్ల పైన, మోటారు వాహనాలు ఎక్కువగా తిరిగే చోటే ఉంటుందనుకుంటారు అందరూ.. కానీ ఇంట్లో చేసే కొన్ని పనుల వల్ల కూడా అక్కడి వాతావరణం కాలుష్యమవుతుంది. వంట చేసేప్పుడు వచ్చే పొగ, బొద్దింకలకు, దోమలను చంపడానికి వాడే మందులు, మొక్కలకు వాడే పురుగు మందులు,వంటింటి పరికరాల్లో పేరుకునే దుమ్ము వంటివన్నీ వాతావరణ కాలుష్య కారకాలేనట.. వీటితో పాటు ఒత్తిడి, నిద్రలేమి వంటివి ఉంటే ఆరోగ్యం తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలా జరగకుండా ఉండాలంటే ఇంటిని సురక్షితంగా, కాలుష్యం లేకుండా ఉంచుకోవాలని చెబుతున్నారు నిపుణులు. మరి అందుకు ఎటువంటి చిట్కాలు పాటించాలో చూద్దాం..

- ఇంట్లో స్వచ్ఛమైన గాలిని అందించే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలి. స్పైడర్ ప్లాంట్స్, వెదురు మొక్కలు వంటి వాటిని పెంచుకోవాలి. వీటితో పాటు చిన్న చిన్న టెరరియమ్స్‌ను ఎంచుకోవచ్చు. ఇవి ఇంటికి అందాన్ని ఇవ్వడంతో పాటు స్వచ్ఛమైన గాలిని కూడా అందిస్తాయి.
- వంట చేసేటప్పుడు కిటికీలను తీసి ఉంచాలి. అలాగే ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను కూడా వేసి ఉంచాలి. వంట పూర్తైన పది నిముషాల వరకు దీనిని ఆపకూడదు.
- వంటింటి వస్తువులను.. అంటే మిక్సీ, వెట్ గ్రైండర్, ఒవెన్ , చిమ్నీ వంటి వాటిని వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలి.
- దుమ్ము ఇంట్లోకి వస్తుందని చాలా మంది కిటికీలు, తలుపులను వేసి ఉంచుతారు. ఫలితంగా ఇంట్లో వాడే రూమ్ ఫ్రెషనర్లు, శరీరానికి వాడే డీయోడ్రెండ్లు, దోమలను చంపడానికి వాడే మందులు, దుమ్ముతో కూడిన గాలి బయటకు వెళ్లవు. వీటిని పీల్చడం వల్ల అనేక అనారోగ్యాలు తలెత్తుతాయి. అందుకే రోజులో కాసేపు కిటికీలను తీసి ఉంచాలి. ఫలితంగా సూర్యకిరణాలు, స్వచ్ఛమైన గాలి ఇంట్లోకి వస్తుంది. ఇంట్లోని గాలి బయటకు వెళుతుంది.
- కార్పెట్లు, రగ్గులపై దుమ్ము ఎక్కువగా చేరుతుంది. అందుకే వాటిని వారానికి ఒకసారి మారుస్తూ ఉండాలి. డోర్ మాట్స్ వంటి వాటిని రెండు రోజులకు ఒకసారి మార్చాలి.
- దుప్పట్లు, దిండు కవర్లను వారానికి రెండుసార్లు మార్చాలి. సమయం ఉండదు అనుకునేవారు కనీసం వారానికి ఒకసారి అయినా మార్చాలి.
- కర్టెన్లు, కార్పెట్లు, కుషన్ కవర్లు వంటి వాటికి మైక్రోబియల్ వస్త్రాలను ఉపయోగించడం మేలు. వీటితో సూక్ష్మజీవుల సమస్య ఉండదు.
- భూమిలో త్వరగా కలిసిపోయే చెక్కతో చేసిన ఫర్నిచర్ కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల రసాయనాలు గాలిలోకి విడుదల అవుతాయన్న భయం ఉండదు.



దుమారం రేపిన దిగ్విజయ్ సింగ్ పోస్ట్

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ప్రశంసలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 27: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేసిన ఫోటో తీవ్ర దుమారాన్ని రేపుతున్నది. ఆయన ఆ ఫోటోపై చేసిన కామెంట్ కూడా పెను చర్చకు దారి తీస్తున్నది. 1990వ దశకానికి చెందిన ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను దిగ్విజయ్ సింగ్ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. బీజేపీతో పాటు ఆర్ఎస్ఎస్‌ను కూడా దిగ్విజయ్ తన పోస్టులో కొనియాడారు. దిగ్విజయ్ పోస్టు చేసిన ఫోటోలో.. బీజేపీ నేత ఎల్‌కే అద్వాణీతో పాటు మోదీ కూడా ఉన్నారు. అద్వాణీ కూర్చులో కూర్చున్నారు. ఆయన ముందు నేలపై మోదీ కూర్చున్నారు. బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్న ఆ ఫోటోను దిగ్విజయ్ ట్వీట్ చేశారు. ఆ ఫోటోను ఖోరా సైట్‌లో కనుగొన్నానని, చాలా ఆసక్తికరంగా ఆ ఫోటో ఉందని, అట్టడుగు స్థాయిలో పనిచేసే ఆర్ఎస్ఎస్ వర్కర్లు, జన్ సంఘ నేతలు ఫోటోలో ఉన్నారని, నేలపై కూర్చున్న వ్యక్తి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయినట్లు పేర్కొన్నారు. ఇది ఆ సంస్థ శక్తి అని, జై సియా రామ్ అంటూ దిగ్విజయ్ సింగ్ పోస్టు చేశారు. అయితే ఆ ఫోటోను 1996లో తీసినట్లు తెలుస్తోంది. గుజరాత్ సీఎంగా శంకర్ సింఘ్ వాఘేలా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆ ఫోటో తీసినట్లు భావిస్తున్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్న నియంతృత్వ, అప్రజాస్వామిక విధానాలను దిగ్విజయ్ ఎక్స్‌పోజ్ చేశారని బీజేపీ నేత సీఆర్ కేశవన్ ఆరోపించారు.

కరుణ, త్యాగాలకు ప్రతిరూపం గురుగోవింద్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 27: ధైర్యం, కరుణ, త్యాగాలకు గురు గోవింద్ సింగ్ ప్రతిరూపంగా నిలుస్తారని ప్రధాని మోదీ అన్నారు. మానవుల మనుగడను కాపాడేందుకు.. సత్యం, న్యాయం, ధర్మం వైపు నిలబడేందుకు గురుగోబింద్ జీవితం, బోధనలు ప్రేరణ కలిస్తాయని ప్రధాని తెలిపారు. పదవ సిక్కు మత గురువు గురు గోబింద్ సింగ్ విజన్ ఇప్పటికీ అనేక మందిని సేవ, నిస్వార్థ కర్తవ్యం దిశగా నడుపుతుందన్నారు. గురు గోబింద్ సింగ్ జీ పవిత్రమైన ప్రకాశ్ ఉత్సవ్ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇవాళ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేశారు. గురుగోబింద్‌కు వినమ్రంగా నమస్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది పాట్నాలోని తకత్ శ్రీ హరిమందిర్ పాట్నా సాహిబ్ వెళ్లిన ఫోటోలను ఆయన పోస్టు చేశారు. గురుగోబింద్‌కు చెందిన పవిత్ర పాదరక్షకులు జోరే సాహిబ్‌ను దర్శించుకున్నట్లు కూడా మోదీ చెప్పారు. గురుగోబింద్ సింగ్ కుమారులు సాహిబ్‌జాదే బాబా జోరావార్ సింగ్, బాబా ఫతే సింగ్ అమరులైనారని, వారిని స్మరించేందుకు డిసెంబర్ 28వ తేదీన వీర్ బాల్ దివస్‌ను సెలబ్రేట్ చేస్తున్నట్లు గతంలో మోదీ చెప్పారు. అయితే వీర్ బాల్ దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలను ఆర్గనైజ్ చేస్తున్నారు. షాహిబ్‌జాదాల ధైర్యసాహసాల గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గురు గోబింద్ సింగ్ కుమారులైన సాహిబ్‌జాదీలు భారతీయుల గుండె ధైర్యాన్ని, సాహసాన్ని ప్రదర్శించి.. క్రూరమైన మొఘల్ సుల్తాన్‌లను మట్టికరిపించినట్లు శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ చెప్పారు.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

గంభీర్‌ను తప్పిస్తారా..?

- ప్రమాదంలో హెడ్‌కోచ్ పదవి

ఏడాది వ్యవధిలోనే స్వదేశంలో రెండు టెస్టు సిరీస్‌ల్లోనూ వైట్ వాష్‌నకు గురైన భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిందా? అందరూ వేలెత్తి చూపిస్తున్నట్టుగానే హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌పై వేటు తప్పదా? పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో రాణిస్తున్నా టెస్టుల్లో విఫలమవుతున్న అతడిని ఆ ఫార్మాట్ నుంచి తప్పించి 'మెన్ ఇన్ బ్లూ'కు ఇద్దరు కోచ్‌ల సంస్కృతికి తెరతీయనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. నిరుడు న్యూజిలాండ్, కొద్దిరోజుల క్రితమే దక్షిణాఫ్రికా.. భారత్‌ను భారత్‌లో వైట్ వాష్ చేసి సంచలనం సృష్టించాయి. దీనికి తోడు టెస్టుల్లో కోచ్‌గా గంభీర్‌కు దారుణమైన రికార్డు ఉంది. అతడి హయాంలో భారత జట్టు 19 మ్యాచ్‌లు ఆడితే అందులో 7 మాత్రమే గెలిచి ఏకంగా పదింట్లో ఓడింది. రెండింటిని డ్రా చేసుకుంది. దక్షిణాఫ్రికాతో సిరీస్ ముగిసిన తర్వాత హెడ్‌కోచ్‌ను మార్చాలన్న డిమాండ్లు ఊపందుకున్న నేపథ్యంలో బీసీసీఐ.. సీవోఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌ను సంప్రదించినట్టు తెలుస్తున్నది. అయితే అందుకు విముఖత వ్యక్తం చేసినట్టు బోర్డు వర్గాల సమాచారం. ప్రస్తుతానికి హెడ్‌కోచ్ పదవికి వచ్చిన ముప్పేమి లేకపోయినా గంభీర్‌పై భారీ ఒత్తిడే ఉంది. టెస్టుల్లో భారత ప్రదర్శన నేపథ్యంలో వచ్చే ఏడాది భారత్‌లో జరుగబోయే ఐసీసీ టీ20 వరల్డ్ కప్ అతడికి అత్యంత కీలకం కానుంది. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత్.. టైటిల్‌ను నిలబెట్టుకుంటేనే గంభీర్ కెరీర్ సాఫీగా సాగే అవకాశముంటుందని, లేదంటే బీసీసీఐ కూడా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తుందని బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇప్పటికే టీమ్‌ఇండియా డ్రెస్సింగ్‌రూమ్‌లో విభేదాలున్నాయని.. గంభీర్‌తో సీనియర్లకు పొసగడం లేదన్న ప్రచారమూ సాగుతున్న తరుణంలో టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు టైటిల్‌ను అందించడం గంభీర్ ముందున్న అతిపెద్ద సవాల్.



15 యేండ్ల నిరీక్షణకు తెర

- ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్‌కు టెస్టు విజయం
- రెండ్రోజుల్లోనే ముగిసిన మెల్‌బోర్న్ టెస్టు

ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు విజయం సాధించాలన్న ఇంగ్లండ్ 15 ఏండ్ల కల ఎట్టకేలకు నెరవేరింది. 5,468 రోజుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ కంగారూల గడ్డపై బెన్ స్టోక్స్ సేన చిరస్మరణీయ విజయాన్ని నమోదుచేసింది. 11 రోజుల్లోనే యాషెస్‌ను కోల్పోయిన ఆ జట్టు.. రెండ్రోజుల్లోనే ముగిసిన మెల్‌బోర్న్ టెస్టులో ఆతిథ్య జట్టును 4 వికెట్ల తేడాతో ఓడించి క్లీన్‌స్వీప్ గండాన్ని తప్పించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ సేన నిర్దేశించిన 175 పరుగుల ఛేదనను ఇంగ్లండ్.. తమకు అచ్చొచ్చిన బజ్‌బాల్ ఆటతో 32.2 ఓవర్లలోనే 6 వికెట్లు నష్టపోయి పూర్తిచేసింది. జాకబ్ బెతెల్ (40), జాక్ క్రాలీ (37), బెన్ డకెట్ (34) రాణించారు. ఈ మ్యాచ్‌లో ఏడు వికెట్లు తీసిన ఇంగ్లండ్ పేసర్ జోష్ టంగ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరుజట్ల మధ్య ఆఖరి టెస్టు జనవరి 4 నుంచి సిడ్నీలో మొదలవనుంది. తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్ (39 ఓవర్లు)కే ఆలౌట్ అయిన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. 34 ఓవర్లు మాత్రమే బ్యాటింగ్ చేసి 132 రన్స్‌కు కుప్పకూలింది. బ్రైడన్ కార్స్ (4/34), కెప్టెన్ బెన్ స్టోక్స్ (3/24), తొలి ఇన్నింగ్స్ హీరో జోష్ టంగ్ (2/44) కంగారూలను కుదురుకోనీయలేదు. హెడ్ (46) టాప్ స్కోరర్. ఆసీస్ నిర్దేశించిన 175 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ తమ మార్కు బజ్‌బాల్ ఆటతో రెచ్చిపోయింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్.. 7 ఓవర్లకే 51 పరుగులు జతచేసి మంచి ఆరంభాన్ని అందించారు. ఈ ఇద్దరూ నిష్క్రమించినా సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన బెతెల్ సంయమనంగా ఆడి ఇంగ్లండ్ విజయాన్ని ఖరారు చేశాడు. రూట్ (15), స్టోక్స్ (2) విఫలమైనా బ్రూక్ (18*) లాంఛనాన్ని పూర్తిచేశాడు. 2011 జనవరి సిడ్నీలో జరిగిన టెస్టులో గెలిచిన తర్వాత ఇంగ్లండ్.. ఆసీస్ గడ్డపై టెస్టు విజయాన్ని మరిచిపోయింది. ఈ 15 ఏండ్ల కాలంలో అక్కడ 18 టెస్టుల మ్యాచ్‌లు ఆడిన ఇంగ్లండ్.. 16 ఓడి రెండింటిని డ్రా చేసుకుంది. తాజా సిరీస్‌కు వెళ్లడానికి ముందు కూడా స్టోక్స్ సేనపై పెద్దగా అంచనాలు లేకపోయినా తొలి మూడు టెస్టుల్లో ఆ జట్టు ప్రదర్శన చూసి మరో క్లీన్‌స్వీప్ తప్పదనకుంటున్న తరుణంలో మెల్‌బోర్న్ పిచ్ ఇంగ్లండ్‌కు వరమైంది. బ్యాటర్లకు పీడకలలను మిగిల్చిన ఈ పిచ్‌లో ప్రతి 39 బంతులకు ఒక వికెట్ పడింది. రెండ్రోజుల్లో 36 వికెట్లు నేలకూలిన పిచ్‌పై ఇంగ్లిష్ జట్టు తమ కలను నెరవేర్చుకుంది.



గ్రౌండ్లోనే కుప్పకూలిన కోచ్

- బంగ్లాదేశ్ క్రికెట్‌లో తీవ్ర విషాదం

బంగ్లాదేశ్ క్రికెట్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ ఢాకా క్యాపిటల్స్ అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జాకీ (59) మరణించారు. శనివారం సిల్హెట్ వేదికగా రాజ్‌షాహి రాయల్స్‌తో జరగాల్సిన మ్యాచ్‌కు కొద్ది నిమిషాల ముందు మహబూబ్ అలీ మైదానంలోనే కుప్పకూలారు. వెంటనే ఫిజియోలు వచ్చి సీపీఆర్ చేసి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ దేబాశిష్ చౌదరి ధ్రువీకరించారు. అయితే మరణాన్ని గల కచ్చితమైన కారణాలను వెల్లడించలేదు. మైదానంలో ఉన్న ఆటగాళ్లు, అధికారులు విషయం తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే సిల్హెట్ టైటాన్స్, నోవాఖాలీ ఎక్స్‌ప్రెస్, చట్టోగ్రామ్ రాయల్స్ జట్లకు చెందిన ప్లేయర్లు, కోచ్‌లు తమ ప్రాక్టీస్ ఆపేసి ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన మృతి పట్ల బంగ్లాదేశ్ క్రికెట్ ఎక్స్ వేదికగా సంతాపం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ పేస్ బౌలింగ్ విభాగంలో జాకీ ఒక లెజెండరీ కోచ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. అండర్ 19 వరల్డ్ కప్ (2020)ను బంగ్లాదేశ్ సొంతం చేసుకోవడంలో బౌలింగ్ కోచ్‌గా ఆయనది కీలక పాత్ర. అదేవిధంగా టాస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం వంటి స్టార్ పేసర్లు జాకీ కోచింగ్‌లోనే రాటు దేలారు. ఆయన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు స్పెషలిస్ట్ బౌలింగ్ కోచ్‌గా, బౌలింగ్ యాక్షన్ రివ్యూ కమిటీ సభ్యుడిగా సేవలందించారు.

నేడు నాలుగో టీ20

స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా భారత మహిళల జట్టు నేడు నాలుగో టీ20 ఆడనున్నది. ఇప్పటికే వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి 30 ఆధిక్యంతో సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా..క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. తిరువనంతపురం వేదికగా జరుగబోయే ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు స్టార్ స్పోర్ట్స్, డిస్నీ హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

'ఛాంపియన్' రోషన్‌కి.. అల్లు అరవింద్ ఆఫర్

టాలీవుడ్ లో కొత్త టాలెంట్ ను గుర్తించడంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ స్టైలే వేరు. ఎంతోమంది యువ హీరోలను ఎంకరేజ్ చేసి, వారిలో స్పార్క్ కనిపిస్తే వెంటనే తన బ్యానర్ లో అవకాశాలు ఇస్తుంటారు. ఇప్పుడు ఆ లక్కీ ఛాన్స్ యంగ్ హీరో రోషన్ మేకాను వరించింది. వైజయంతీ మూవీస్ బ్యానర్ లో రోషన్ నటించిన లేటెస్ట్ మూవీ 'ఛాంపియన్' ఇప్పుడు ఇండస్ట్రీ లో హాట్ టాపిక్ గా మారింది. ఈ సినిమాతో రోషన్.. అల్లు అరవింద్ దృష్టిలో పడ్డాడు. ఇటీవలే 'ఛాంపియన్' సినిమాను చూసిన అల్లు అరవింద్, అందులో రోషన్ పర్ఫార్మెన్స్ కు ఫిదా అయ్యారట. ఆ వయసుకి మించిన పరిణితితో రోషన్ నటించిన తీరు, స్క్రీన్ ప్రెజెన్స్ ఆయనకు ఎంతగానో నచ్చాయి. దీంతో వెంటనే ఆ కుర్రాడిని అభినందించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ఈరోజు హైదరాబాద్ లో అల్లు అరవింద్, రోషన్ మేకాను ప్రత్యేకంగా తన ఆఫీస్ కు ఆహ్వానించి కలిశారు. కేవలం మాటలతో మెచ్చుకుని వదిలేయకుండా, రోషన్ కు ఒక అదిరిపోయే ఆఫర్ ఇచ్చారు అల్లు అరవింద్. తన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలో రోషన్ హీరోగా ఒక భారీ ప్రాజెక్ట్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రోషన్ లుక్స్, డ్యాన్స్ లో ఈజ్, సినిమా కోసం అతను చూపించిన డెడికేషన్ చూసి.. వెంటనే మరో ఆలోచన లేకుండా సినిమాను లాక్ చేసుకున్నారు. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి ఆఫర్ రావడం రోషన్ కు పెద్ద జాక్ పాట్ అనే చెప్పాలి. లెజెండరీ ప్రొడ్యూసర్ నుంచి ఇలాంటి పిలుపు రావడంతో రోషన్ ఆనందానికి అవధులు లేవు. తనలోని టాలెంట్ ను గుర్తించి, ఇంత పెద్ద ప్లాట్ ఫామ్ ఇచ్చినందుకు అల్లు అరవింద్ కు రోషన్ కృతజ్ఞతలు తెలిపాడు. గీతా ఆర్ట్స్ కాంపౌండ్ లో సినిమా అంటే ఆ హీరో కెరీర్ గ్రాఫ్ మారినట్లే. మొత్తానికి 'ఛాంపియన్' ఫలితంతో సంబంధం లేకుండా రోషన్ కు జరగాల్సిన మేలు అయితే జరిగిపోయింది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో తెరకెక్కిన 'ఛాంపియన్' చిత్రంలో అనశ్వర రాజన్ హీరోయిన్ గా నటించింది. స్వప్న సినిమా నిర్మాణ విలువలు, రోషన్ నటనకు ప్రస్తుతం ఆడియెన్స్ నుంచి మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఓవైపు సినిమాకు వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్, మరోవైపు మెగా ప్రొడ్యూసర్ ఇచ్చిన ఆఫర్ తో 'ఛాంపియన్' టీమ్ మొత్తం ఫుల్ ఖుషీగా ఉంది.



హ్యాపీ బర్త్‌డే సల్మాన్ భాయ్

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ శనివారం 60వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా అతడికి సినీ, క్రీడా. రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక సల్మాన్ బర్త్‌డేను పురస్కరించుకుని టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సల్మాన్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ చిరంజీవి ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. నా ప్రియమైన సోదరుడు సల్మాన్ ఖాన్‌కు 60వ పుట్టినరోజు శుభాకాంక్షలు. సల్లూ భాయ్, ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకున్న నీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ఏడాది నీకు అపారమైన ఆనందాన్ని, ఆయురారోగ్యాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.నిన్ను స్నేహితుడని పిలవడం మా లాంటి వారికి దక్కిన అదృష్టం. నీవు మరెన్నో విజయాలు అందుకోవాలి. ఈ రోజంతా సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాను అంటూ చిరంజీవి రాసుకొచ్చాడు. గతంలో చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' సినిమాలో సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో మెరిసిన విషయం తెలిసిందే.

'45 ది మూవీ' అందరినీ ఆకట్టుకుంటుంది

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివ రాజ్ కుమార్

శివ రాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి స్టార్‌లతో అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రం '45 ది మూవీ'. ఈ చిత్రాన్ని సూరజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శ్రీమతి ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మించారు. మైత్రి ద్వారా తెలుగులో జనవరి 1న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శనివారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. శివ రాజ్ కుమార్ మాట్లాడుతూ .. "వేద' తరువాత మళ్లీ '45' మూవీ కోసం హైదరాబాద్‌కు వచ్చాను. నాలుగైదు నిమిషాల్లోనే అర్జున్ జన్య గారు అద్భుతంగా స్టోరీని నెరేట్ చేశారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ అద్భుతంగా అనిపించింది. ఈ కథను మీరే డైరెక్ట్ చేయండని అర్జున్ గారికి సలహా ఇచ్చాను. ముందుగా ఓ రెండు మూడే సీన్లు యానిమేషన్స్‌లో అర్జున్ గారు చిత్రీకరించారు. రమేష్ గారు ఆ సీన్లు చూసి సినిమా అవకాశం ఇచ్చారు. అర్జున్ తనకు ఇచ్చిన అవకాశానికి పూర్తిగా న్యాయం చేశారు. తెలుగులో మా మూవీని మైత్రి రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. కన్నడలో ఆల్రెడీ సక్సెస్ అయింది. ఈ మూవీని చూస్తే కచ్చితంగా ప్రతీ ఒక్క ప్రాణిని ప్రేమిస్తారు.. గౌరవిస్తారు. ఎన్ని రోజులు భూమ్మీద బతుకుతామో తెలీదు.. బతికినన్ని రోజులు సంతోషంగా బతకాలని ఈ మూవీ చెబుతుంది. సత్య కెమెరా వర్క్, రవి వర్మ ఫైట్స్ ఇలా అన్నీ అద్భుతంగా ఉంటాయి. అర్జున్ గారు ఇండియాలో నెంబర్ వన్ డైరెక్టర్ అవుతారు. ఈ మూవీ అందరినీ మనస్ఫూర్తిగా ఆకట్టుకుంటుంది. జనవరి 1న మా మూవీని అందరూ చూడండి' అని అన్నారు.

'666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'

ప్రియాంక మోహన్.. ఫస్ట్ లుక్ విడుదల

వెర్సటైల్ స్టార్ ధనంజయ ప్రధాన పాత్రలో నటిస్తోన్న '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నో అప్డేట్స్‌తో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే పలువురు స్టార్స్‌తో నిండిన ఈ సినిమాలోకి ఇప్పుడు పాపులర్ హీరోయిన్ ప్రియాంక మోహన్ జాయిన్ అయ్యారు. తాజాగా ఈ సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేసింది. రెండు వేర్వేరు పోస్టర్లలో విడుదలైన ఈ ఫస్ట్ లుక్‌లో ప్రియాంక మోహన్ లుక్‌ను గమనిస్తే.. డిజైన్ పరంగానూ, కథకు కనెక్ట్ అయ్యేలా ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఈ పోస్టర్లలో ఆమె వింటేజ్ లుక్, కళాత్మక శైలిలో చూపించారు. పోస్టర్స్‌ను జాగ్రత్తగా గమనిస్తే ఎన్నో చిన్న విషయాలు అర్థమవుతాయి. మొదటి పోస్టర్‌ను చూస్తే..ఆమె వెనుక భాగంలో మెరిసే బంగారు రంగు పౌర్ణమి చంద్రుడితో కనిపిస్తుంది. ఆమె లావెండర్ రంగు బ్లౌజ్, పూల డిజైన్ ఉన్న స్కర్ట్ ధరించింది. ఈ పోస్టర్‌లో వింటేజ్ వాతావరణాన్ని, మోడ్రన్ స్టైలింగ్, రంగులు కలగలిసిన ఫ్రేమ్ ద్వారా చూపించారు. ఇందులో ఆమె ధరించిన ఇయర్‌ఫోన్స్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీంతో ఈ సినిమా టైమ్ ట్రావెల్‌కు సంబంధించిన కాన్సెప్ట్‌తో రూపొందుతుందని అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. రెండో పోస్టర్‌ను గమనిస్తే ప్రియాంక మోహన్‌ను రెట్రో స్టైల్‌లో చూపించారు. ఆమె ముత్యాల ఆభరణాలు, పువ్వుల డిజైన్ ఉన్న డ్రెస్సు, గ్లవ్స్, పెద్ద అంచులు ఉన్న టోపీ ధరించిన లుక్‌లో కనిపిస్తుంది. ఈ లుక్ చూస్తే క్లాసిక్ టైమ్ నేపథ్యంతో రూపొందిన థ్రిల్లర్ సినిమాకు చక్కగా సరిపోతుంది. ఈ పోస్టర్‌లో చూపించిందే కంటే దాచిందే ఎక్కువగా ఉందనిపిస్తోంది. అందువల్ల ఆమె పాత్రపై మరింత ఆసక్తి ఏర్పడుతుంది. మృదువైన రంగులు, క్లాసిక్ స్టైలింగ్ పాతకాలపు సినిమాల అందాన్ని గుర్తు చేయటమే కాకుండా. ఆ పాత్రతో సినిమా చుట్టూ ఉన్న మిస్టరీ వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200